ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
బుధవారం 13 నవంబరు 2024




..రయ్‌రయ్



పూర్తయిన చిలకలూరిపేట బైపాస్ రోడ్డు

సర్వాంగ సుందరంగా.. అధునాతనంగా.. ఆహ్లాదకరంగా.. రక్షణాత్మకంగా.. పర్యావరణహితంగా.. చిలకలూరిపేట బైపాస్ అందుబాటులోకి వచ్చేసింది. ఎన్నో ఏళ్లుగా.. చిలకలూరిపేటవాసుల కలగా.. చిలకలూరిపేట మీదగా రాకపోకలు సాగిస్తూ ఇబ్బంది పడే వారి కష్టాలను తీరుస్తూ ఎట్టకేలకు బైపాస్ నిర్మాణం జరిగింది. 16వ నంబరు జాతీయ రహదారిపై గుంటూరు, ఒంగోలు మధ్య చిలకలూరిపేట పట్టణాన్ని బైపాస్ చేస్తూ సుమారు రూ.వెయ్యి కోట్ల వ్యయంతో 16.384 కిలోమీటర్ల మేర ఆరు వరుసల్లో నిర్మాణం చేశారు. దేశంలోనే మొదటిసారిగా మోడల్ బైపాస్‌గా రూపొందించిన ఈ రోడ్డుపై వాహనదారులు రయ్‌రయ్‌మంటూ త్వరలో ప్రయాణించనున్నారు. ఎన్నో ప్రత్యేకతలతో నిర్మాణం జరిగిన బైపాస్‌ను ఈ నెలాఖరుకు ప్రారంభించే అవకాశం ఉంది.

- సుందరంగా చిలకలూరిపేట బైపాస్
- దేశంలోనే మొదటి మోడల్ బైపాస్ రోడ్డు
- ఈ నెలాఖరులో ప్రారంభించడానికి సన్నాహాలు
- చిలకలూరిపేటకు మణిహారంగా రోడ్డు నిర్మాణం



1. సర్వీస్ రోడ్ పక్కన నిర్మించిన బస్సు షెల్టర్
2. నరసరావుపేట మార్గంలో నిర్మించిన అండర్ పాస్
3. బైపాస్ పక్కన ఏర్పాటుచేసిన సోలార్ వ్యవస్థ

బైపాస్ రోడ్డు ప్రత్యేకతలు

- చిలకలూరిపేట బైపాస్ రోడ్డుకు రెండు వైపులా 16 కిలోమీటర్ల పొడవునా శాశ్వత గోడ నిర్మాణం.
- గణపవరం వద్ద విశాలమైన ప్రదేశంలో రెండు చోట్ల ఒక మెగా వాట్ సోలార్ ప్లాంటును ఏర్పాటు చేస్తున్నారు.
- రోడ్డు పొడవునా ఒకవైపున ట్రీ గార్డులతో 3,500 మొక్కలను నాటుతున్నారు. డివైడర్లపై కాగితం పూల మొక్కలను నాటారు.
- బైపాస్ రోడ్డులో అత్యంత అధునాతనమైన ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఎక్కడికక్కడ కెమెరాల ఏర్పాటు చేశారు.
- ఒంగోలు గుంటూరు మధ్య ప్రయాణం చేసే వాహనదారులకు సుమారు 30 నిమిషాల సమయం ఆదా.
- మొత్తం మూడు ఫ్లై ఓవర్లు, ఆరు అండర్ పాస్‌ల నిర్మాణం

చిలకలూరిపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా ఎన్నో సవాళ్లు.. మరెన్నో అవాంతరాలను అధిగమించి ఎట్టకేలకు చిలకలూరిపేట బైపాస్ రహదారి అందుబాటులోకి వచ్చేసింది. జాతీయ రహదారిపై మార్టూరు గుంటూరు మధ్య రామచంద్రాపురం వద్ద ప్రారంభమై తిమ్మాపురం గ్రామం వరకు నిర్మాణం జరిగింది. బైపాస్ రోడ్డు భూసేకరణకు సుమారు రూ.300 కోట్లు ఖర్చు చేయగా, రోడ్డు నిర్మాణానికి సుమారు రూ.700 కోట్లు ఖర్చు చేశారు. సర్వాంగ సుందరంగా, వాహనదారులకు ఇబ్బంది లేని రీతిలో బైపాస్ రోడ్డు నిర్మించారు. ఈ మార్గంలో ఓగేరు, కుప్పగంజి వాగులపై రెండు వంతెనలను నిర్మించారు. ఫ్లై ఓవర్లు, అండర్ పాస్ ల వద్ద విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. బొప్పూడి

(మిగతా 8లో)

చీఫ్‌విప్‌గా జీవీ

- ప్రకటించిన కూటమి ప్రభుత్వం
- ఆంజనేయులు కష్టానికి దక్కిన ఫలితం
- ఎట్టకేలకు పల్నాడు జిల్లాకు కీలక పదవి



నరసరావుపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ చీఫ్‌విప్‌గా వినుకొండ సీనియర్ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. మంత్రివర్గంలో ఇటు గుంటూరు నుంచి ఇద్దరికి, అటు బాపట్ల జిల్లా నుంచి ఇద్దరికి మంత్రి పదవులు వరించాయి. అయితే పల్నాడు జిల్లాకు ఒక్క మంత్రి పదవికి కూడా దక్కలేదు. ఈ పరిస్థితుల్లో పల్నాడు జిల్లాకు ఎట్టకేలకు కీలక పదవి దక్కింది. వినుకొండ నుంచి గోనుగుంట్ల వెంకట శివ సీతారామాంజనేయులు(జీవీ) మూడు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ప్రతిపక్షంలో ఐదేళ్లు పార్టీ అభివృద్ధికి ఆయన ఎంతగానో కృషి చేశారు. ఈక్రమంలో ఆయన కష్టానికి తగ్గ ఫలితం దక్కింది. జీవీకి మంత్రి పదవి వస్తుందని జిల్లా పార్టీ వర్గాలు భావించాయి. అయితే మంత్రివర్గ కూర్పులో కులాల సమీకరణల కారణంగా జీవీకి మంత్రి పదవి దక్కలేదు. ఈ పరిస్థితుల్లో

(మిగతా 8లో)

పడవ రేవులకు గిరాకీ

గింజుపల్లికి రూ.54 వేలు ఉంటే.. రూ.3.50 లక్షలకు పాడారు

మాదిపాడుకు,తాడువాయి రేవులకు పోటాపోటీ

వల్లభాపురానికి ఒక్కరు కూడా రాలేదు

8

ఏపీలో జపాన్ విద్యా విధానం

టోయామా యూనివర్సిటీతో ఒప్పందం

ఏఎన్‌యూలో జపాన్ బృందం సమావేశం.. హాజరైన ఆరు వర్సిటీల వీసీలు

8

తెనాలి రైల్వేస్టేషన్‌లో రూ.35 లక్షల వెండి పట్టివేత

6

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి



వర్సిటీ వీసీ, అధికారులతో భేటీ అయిన జపాన్ బృందం

సహకార.. ఎన్నికలేనా?

- ఎన్నికలపై ఆసక్తి చూపని ప్రభుత్వం
- త్రి సభ్య కమిటీల కొనసాగింపునకు కసరత్తు
- ఐదేళ్లుగా అధికారుల చేతిలో సొసైటీల నిర్వహణ

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

రైతుల ప్రయోజనాలే పరమావధిగా సొసైటీలు పనిచేయాలి. అయితే ఇందుకు గత ఐదేళ్లు వైసీపీ ప్రభుత్వం తిలోదకాలు ఇచ్చింది. రైతులకు సొసైటీలకు మధ్య దూరం పెంచే నిర్ణయాలతో సరిపెట్టింది. సొసైటీలకు ఎన్నికలు నిర్వహించకుండా దొడ్డిదారిన కమిటీలను నియమిస్తూ కాలయాపన చేసింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 167 సహకార సంఘాలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తుందని రైతులు ఆశించారు. ఈ క్రమంలో గత ప్రభుత్వం నియమించిన త్రి సభ్య కమిటీలు రాజీనామా చేశాయి. అయితే సొసైటీల ఎన్నికలను నిర్వహించేందుకు కూటమి ప్రభుత్వం కూడా ఆసక్తి చూపడంలేదన్న వాదన రైతుల నుంచి వినిపిస్తోంది. ఈ మేరకు కమిటీలను నియమించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోందని సమాచారం. సొసైటీల ఎన్నికలకు సంబంధించి సభ్యులను గుర్తించాల్సి ఉంది. ఈ ప్రక్రియలో జాప్యం జరిగే అవకాశం ఉండటంతో కొత్త ఓటర్ల జాబితాలు రూపొందించే వరకు ప్రత్యేక పాలన కొనసాగించాలని కూటమి ప్రభుత్వం యోచిస్తున్నట్లు సహకార వర్గాలు చెబుతున్నాయి. దీంతో కొంత కాలం ఎన్నికలు వాయిదా పడినట్లేనన్న ప్రచారం జరుగుతోంది. సొసైటీల నిర్వహణ ప్రస్తుతం అధికారుల చేతిలో ఉంది. ముగ్గురు, లేదా ఐదుగురు అధికారులను సొసైటీలకు నామినేట్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. ముగ్గురా.. ఐదుగురా అన్న అంశంపై ఇంకా స్పష్టత రాలేదు.



జొన్నలగడ్డ సొసైటీ భవనం

2019 నుంచి అధికారుల చేతుల్లోనే సొసైటీలు

సహకార సంఘాలకు చివరగా 2013లో ఎన్నికలు జరిగాయి. ఆ తర్వాత 2018లో ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. అయితే అప్పట్లో టీడీపీ ప్రభుత్వం అధ్యక్షుల పదవీ కాలాన్ని 2019 వరకు పొడిగించింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకుండా సొసైటీల్లో ప్రత్యేక పాలన ఏర్పాటు చేసింది. వైసీపీ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకుండా ఆరు నెలలకొకసారి త్రి సభ్య కమిటీల పదవీ కాలాన్ని పొడిగిస్తూ వచ్చింది.

ఇష్టారాజ్యంగా కమిటీలు

ఉమ్మడి గుంటూరు జిల్లాలోని కొన్ని సహకార సంఘాలలో త్రి సభ్య కమిటీలు ఇష్టారాజ్యంగా వ్యవహరించాయన్న విమర్శలున్నాయి. కొన్ని చోట్ల రైతులను ఇబ్బందులకు గురిచేశాయి. రాజకీయ కారణాలతో ఎప్పటి నుంచో పని చేస్తున్న ఉద్యోగులను తొలగించి వారి స్థానంలో కొత్త వారిని నియమించుకున్నాయి. కొన్ని త్రి సభ్య కమిటీలు ప్రభుత్వ ఉత్తర్వులను తుంగలో తొక్కి అక్రమ మార్గంలో ఉద్యోగులను నియమించుకున్నాయన్న ఆరోపణలున్నాయి. ఆయా నియామకాలకు పాత తేదీలను నమోదు చేసుకుని మినిట్స్ రాసుకున్నట్లు సమాచారం. ఎన్నికలు లేక పోవడంతో తాత్కాలిక కమిటీలు పలు అక్రమాలకు పాల్పడ్డాయన్న విమర్శలున్నాయి. పంట రుణాలు మంజూరులో కూడా రాజకీయంగా కమిటీలు ఇబ్బందులకు గురిచేసినట్లు రైతులు వాపోతున్నారు.

అసభ్యకర పోస్టులపై కేసులు?

డీజీపీ, ఐజిని ట్యాగ్ చేస్తూ గతంలో పోస్టులు

ఇప్పటికే వివిధ పోలీస్ స్టేషన్లలో 29 కేసులు నమోదు

బాపట్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో విశృంఖలంగా వ్యవహరిస్తున్న వారిపై వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్లలో 29 కేసులు నమోదైన సంగతి తెలిసిందే. అదే సోషల్ మీడియా వేదికగా గతంలో వైసీపీ శ్రేణులు పెట్టిన అసభ్యకర పోస్టులు, మార్ఫింగ్ ఫొటోలతో వ్యక్తిత్వ హననం చేసిన చిత్రాలను నేరుగా డీజీపీ, ఐజీకి పలువురు ట్యాగ్ చేశారు. జిల్లాకు చెందిన దాదాపు 17 మంది ట్యాగ్ చేసినట్లు తెలుస్తోంది. ఐటీ వింగ్ దృష్టి పెట్టి వివరాలు సేకరిస్తోంది. ఇలా ట్యాగ్ చేసిన పోస్టులు గతంలో ఏ ఐపీ అడ్రస్ నుంచి వచ్చాయో కూడా పోలీస్ శాఖ జల్లెడపడుతోంది. ఇలా ట్యాగ్ చేసిన వాటిలో దారుణంగా వ్యక్తిత్వ హననానికి పాల్పడిన పోస్టులు కూడా ఉన్నట్లు సమాచారం. ఉన్నతాధికారుల నుంచి వచ్చే ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని పోలీస్ శాఖ చెబుతోంది. ఒకవేళ ఎవరైతే ట్యాగ్ చేశారో వారిని సంప్రదించి, వారు ఫిర్యాదు ఇవ్వడానికి సిద్ధంగా ఉంటే ఐపీ అడ్రస్ ఆధారంగా అసభ్యకర పోస్టులు పెట్టిన వారిపై కేసుల నమోదుకు పోలీస్ శాఖ సన్నద్ధమవుతోంది.

త్వరలోనే నిందితుల అరెస్టు..

జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే నమోదైన 29 సోషల్ మీడియా కేసులకు సంబంధించి శాఖాపరమైన విచారణ జరుగుతోంది. ఇందులో తీవ్రత ఎక్కువగా ఉన్న వాటిని 17గా పోలీసులు గుర్తించినట్లు సమాచారం. వీటికి సంబంధించి నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చడానికి పోలీస్‌శాఖ సిద్ధమవుతోంది.

వేమూరు విలీనం

- సీఆర్‌డీఏలో కలుపుతూ ఉత్తర్వులు
- రేపల్లె, బాపట్ల నియోజకవర్గాలకే బావుడా పరిమితం

బాపట్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ పరిధి(బావుడా)లో భాగమై ఉన్న వేమూరు నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాలను తిరిగి సీఆర్‌డీఏలో విలీనం చేయాలని ఇటీవల జరిగిన క్యాబినెట్ సమావేశంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. దానికి సంబంధించి బావుడా పరిధిలోని 562 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణాన్ని సీఆర్‌డీఏలో కలుపుతూ ప్రభుత్వం మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. దీనితో బావుడా పరిధి రేపల్లె, బాపట్ల నియోజకవర్గాలకే పరిమితమైంది

బావుడాకు చైర్మన్ నియామకం...

ఇటీవల ప్రకటించిన నామినేటెడ్ పదవుల్లో జిల్లా టీడీపీ అధ్యక్షుడు సలగల రాజశేఖర్‌బాబును బావుడా చైర్మన్ పదవి వరించిన సంగతి తెలిసిందే. గత ప్రభుత్వంలో బావుడాను కేవలం అలంకార ప్రాయంగా మార్చి ంది. ప్రస్తుతం బావుడాకు చైర్మన్ నియామకం కూడా చేపట్టడంతో నిధుల కేటాయింపు విషయంలో కదలిక రానుంది. అంతే కాకుండా వేమూరు నియోజకవర్గం సీఆర్‌డీఏలో కలిసినా, ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలో భాగంగా ఉన్న అద్దంకి, పర్చూరు, చీరాల నియోజక వర్గాలను బావుడా పరిధిలో తీసుకురావాలన్న ప్రతిపాదనలు గతంలోనే అందాయి. దీనిపై త్వరలోనే ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. అవి కూడా బావుడా గొడుగు కిందకు వస్తే కార్యకలాపాలు ఊపందుకోవడంతో పాటు కేంద్రం నుంచే వచ్చే నిధులపై కూడా దృష్టి సారించడానికి వీలు కలుగుతుంది.

యార్డుకు.. లక్షన్నర టిక్కీలు

గుంటూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మిర్చి కొత్త పంట రాక ప్రారంభం అవుతుండగా.. కోల్డ్‌స్టోరేజ్‌ల్లో నిల్వ చేసిన టిక్కీలను విక్రయించేందుకు రైతులు పోటీ పడుతున్నారు. ఈ రెండు నెలల్లో విక్రయించుకోలేకపోతే జనవరి నుంచి గుంటూరు, పల్నాడు జిల్లాల నుంచి వచ్చే కొత్త పంటతో ఇబ్బందులు తలెత్తుతాయని భావిస్తూ ప్రస్తుత అన్‌సీజన్‌లో రోజుకు లక్షన్నర టిక్కీల శాంపిల్స్‌ని విక్రయానికి పెడుతున్నారు. అయితే ఎగుమతుల డిమాండ్ లేకపోవడంతో కనీసం 50 శాతం టిక్కీలు కూడా కొనుగోళ్లు జరగడం లేదు. దీంతో ధర నేలచూపులు చూడటం ప్రారంభించింది. కొద్ది రోజుల నుంచి గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీకి గుంటూరు, పల్నాడు జిల్లాల నుంచే కాకుండా కృష్ణ, ప్రకాశం, నంద్యాల నుంచి కూడా రైతులు కోల్డ్‌స్టోరేజ్‌ల నుంచి మిర్చి టిక్కీలను తీసుకొస్తున్నారు. అన్ సీజన్‌లో రైతులు కేవలం శాంపిల్స్ మాత్రమే తీసుకొస్తారు. ఆయా శాంపిల్స్‌కు సంబంధించిన లాట్స్‌లో ఎన్ని టిక్కీలు ఉన్నాయో పేర్కొంటారు. ఆ విధంగా చూసుకుంటే రోజుకు 1.50 లక్షల టిక్కీలకు సంబంధించిన శాంపిల్స్ పెడుతున్నారు. అన్ సీజన్‌లో ఇంత భారీగా మిర్చి టిక్కీలను విక్రయానికి పెట్టిన దాఖలాలు గతంలో లేవు. ఈ కారణంతో మేలిమి రకాలు నెల క్రితం క్వింటాల్ రూ.18500 దాటగా నేడు రూ.1500లకు పైగా తగ్గాయి. మంగళవారం గుంటూరు మిర్చియార్డులో తేజ వెరైటీ క్వింటాల్ రూ.16500, ఆర్మూరు, బ్యాడిగి రకాలు రూ.12500, 334 రకం రూ.13 వేలు ధర మాత్రమే లభించింది. బంగ్లాదేశ్, చైనా దేశాలకు ఎగుమతులు తగ్గిపోయాయి. ఈ కారణంగా ఆ దేశ దిగుమతిదారులు ఆర్డర్స్ పెట్టడం లేదు. తేజ, బ్యాడిగి, ఆర్మూరుకు డిమాండ్ లేకపోవడంతో ఎగుమతులు జరగడం లేదు.

ప్రైవేట్‌కు ధీటుగా ప్రభుత్వ వైద్యశాలలు

కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్, కార్పొరేట్ వైద్యశాలలకు ధీటుగా ప్రభుత్వ వైద్యశాల ఉండాలని, అందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. క్యాన్సర్ నివారణపై రూపొందించిన ప్రచారపోస్టర్లను కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంబులెన్స్ సేవలు ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. వైద్యశాలలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. తాగునీరు, మరుగుదొడ్లు సౌకర్యం మెరుగుపర్చాలన్నారు. ఆరోగ్యకరమైన సమాజనిర్మాణానికి కౌమరదశ బాలికలకు పరీక్షలు నిర్వహించాలన్నారు. ఈ నెల 14 నుంచి నిర్వహించే నోటిక్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్ సర్వేకు సంబంధించిన పోస్టర్‌ను కూడా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జేసీ ప్రఖర్‌జైన్, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ, డాక్టర్ శేషుకుమార్, డాక్టర్ టి.వెంకటేశ్వర్లు, డీఆర్వో గంగాధరగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటమురళి, డీఎంహెచ్‌వో విజయమ్మ

సాగు విస్తీర్ణం.. ఆదాయం పెరగాలి

జిల్లాలో పంటలసాగు, ఉత్పత్తులు పెంచాలని తద్వారా ఆదాయం మరింత పెరగాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రకృతి వ్యవసాయాన్ని మరింత విస్తరింప చేయాలన్నారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులు మక్కువ చూపేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రోటీన్స్ రైస్ ఉత్పత్తిని పెంచేలా చూడాలన్నారు. చిరుధాన్యాల సాగు ప్రతి మండలంలో ప్రారంభమయ్యేలా వ్యవసాయాధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రైతులు పండించిన పంటలకు మంచి ధరలు లభించేలా ఆన్‌లైన్ మార్కెటింగ్ విధానం అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ధాన్యం సేకరణలో ఇతరుల జోక్యం ఉంటే సహించేది లేదని హెచ్చరించారు. ఆవులు, గేదెలు ఉత్పత్తికి అవసరమైన ప్రణాళికలు రూపొందించుకొని పశుసంపద పెరుగుదలకు పశువైద్యులు కృషి చేయాలన్నారు. కల్తీపాల విక్రయాలను అరికట్టాలన్నారు. పాలు రవాణా చేసే ప్రాంతాలలో ఆకస్మిక తనిఖీలతో నమూనాలు సేకరించి పరీక్షలు చేయాలన్నారు.

తీరంలో మొక్కలు నాటాలి

సముద్రతీరం వెంబడి పెరిగే మొక్కలను ఎంపిక చేసి ఉపాధి హామీ పథకం అనుసంధానం ద్వారా మొక్కలు నాటాలని కలెక్టర్ చెప్పారు. ఈప్రక్రియ 16 రోజుల్లో పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వం కార్యాలయాలన్నిటిలో సౌరవిద్యుత్ వినియోగించేలా చూడాలన్నారు. గుంతల రహిత రహదార్ల నిర్మాణం కొరకు రూ.17.32 కోట్లలను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు.

రికార్డుల మాయం

- డీపీవో కార్యాలయంలో రగడ

బాపట్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రామపంచాయతీ అధికారి కార్యాలయంలో రికార్డుల మాయంపై రగడ జరుగుతున్నది. జిల్లా కేంద్రంగా బాపట్ల ఏర్పడిన తర్వాత జిల్లాపంచాయతీ అధికారి కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసేందుకు చెరుకుపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న కేవీ సురేష్‌ను డిప్యూటేషన్‌పై నియమించారు. ఆయనను ఇటీవల భట్టిప్రోలు మండలం పెదపులివర్రు జడ్పీ ఉన్నత పాఠశాలకు బదిలీ చేశారు. అయితే సిబ్బంది కొరత ఉన్నందున సురేష్‌ను ఇక్కడే ఉంచాలని అధికారులు సిఫార్సు చేశారు. దీంతో ఆయన పెదపులివర్రు స్కూల్‌లో జాయిన్ అయి మరలా డిప్యూటేషన్ మీద వచ్చేందుకు సిద్ధమయ్యారు. ఇదిలా ఉండగా గత నెల 26న సురేష్‌కు సంబంధించిన కప్‌బోర్డు తాళాలను పగలగొట్టి అదే కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎస్.వెంకటేశ్వరావు పలు రికార్డులు తీసుకెళ్ళాడని తోటి ఉద్యోగులు చెప్పారు. దీంతో సురేష్ వచ్చి రికార్డులు మాయం కావడంపై జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకరరావుకు ఫిర్యాదు చేశారు. ఇదే విషయాన్ని కలెక్టర్, పంచాయతీరాజ్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్ళారు. గ్రామపంచాయతీ గ్రేడ్-5, గ్రేడ్-6, గ్రామపంచాయతీ జూనియర్ అసిస్టెంట్లు, బిల్‌కలెక్టర్‌లు, స్వీపర్లకు సంబంధించిన ఫైళ్లను తీశారన్నారు. కాగా ఈవిషయమై డీపీవో ప్రభాకరరావును వివరణ కోరగా ఫైళ్ళు మాయంపై వివరణ ఇవ్వాలని జూనియర్ అసిస్టెంట్ ఎస్.వెంకటేశ్వరరావుకు మెమో ఇచ్చినట్లు తెలిపారు. ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు మధ్య తలెత్తిన ఈ వివాదంపై కలెక్టరేట్‌లో పెద్దఎత్తున చర్చ జరుగుతున్నది.



అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్లుగా రామకృష్ణ, వెంకటేశ్వరరావు



బొమ్మిడి రామకృష్ణ, విశ్వనాథపల్లి వెంకటేశ్వరరావు

రేపల్లె,నవంబరు12(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్లుగా నిజాంపట్నంకు చెందిన బొమ్మిడిరామకృష్ణ, విశ్వనాథపల్లి వెంకటేశ్వరరావును నియమించారు. ఈ మేరకు కూటమి ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా రామకృష్ణను, వెంకటేశ్వరరావును పలువురు టీడీపీ,జనసేన,బీజేపీ నాయకులు అభినందించారు. అగ్నికుల క్షత్రియుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని రామకృష్ణ, వెంకటేశ్వరరావులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు,ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు, రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందీశ్వరికి కృతజ్ఞతలు తెలిపారు.

డిప్యూటేషన్ పేరిట తిష్ఠ.. అవినీతికి పరాకాష్ఠ

- ఓ ద్వితీయశ్రేణి అధికారిపై వల్లమాలిన ప్రేమ!
- పాఠశాల విద్యాశాఖకు ఆర్‌జేడీ కార్యాలయం ద్వారా లేఖ
- అక్రమాల రింగ్ మాస్టర్‌కు ఉన్నతాధికారుల వెన్నుదన్ను
- హెచ్‌ఎంలు, ఎంఇవోల నిరసన



ఆర్‌జేడీ కార్యాలయం

గుంటూరు(విద్య),నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆర్‌జేడీ కార్యాలయంలో పనిచేస్తున్న ఆయనను ప్రభుత్వం ఇటీవల బదిలీ చేసి కమిషనరేట్‌కు పంపుతూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, ఇక్కడ ఆయన లేకపోతే అక్రమ వసూళ్ళకు రింగ్ మాస్టర్ లేడనే ఉద్దేశ్యంతో డిప్యూటేషన్ పేరుతో ఆయనను మళ్లీ పాత స్థానంలోనే కొనసాగేలా ఆర్‌జేడీ కార్యాలయ సిబ్బంది కొంతమంది పక్కా ప్రణాళిక సిద్ధం చేశారు. దీనికి ఉన్నతాధికారుల మద్దతు పలకడంతో ఆ ద్వితీయ శ్రేణి అధికారి తీరు వివాదాస్పదం అవుతోంది. ఇటీవల ప్రభుత్వం పాఠశాల విద్యశాఖలో భారీ ఎత్తున బదిలీలు చేసింది. తొలుత డీవోలను బదిలీ చేసింది. ఆరోపణలు ఉన్న వారికి పోస్టింగ్ కూడా ఇవ్వలేదు. ఆ తర్వాత కార్యాలయాల్లో సిబ్బందిని బదిలీ చేశారు. ఏళ్ళ తరబడి ఒకేచోట పాతుకుపోయి అక్రమాలకు దన్నుగా ఉన్నారనే ఉద్దేశ్యంతో అనేక మందిని బదిలీ చేసింది. ఇందులో భాగంగా మూడు జిల్లాలను పర్యవేక్షించే గుంటూరు ఆర్‌జేడీ కార్యాలయంలో పని చేసే ఓ ద్వితీయ శ్రేణి అధికారిని కూడా బదిలీ చేసి కమిషనరేట్‌లో పోస్టింగ్ ఇచ్చారు. అయితే, ఇక్కడ నుంచి ఆయన వెళ్లిపోతే అక్రమ వసూళ్ళకు ఆస్కారం ఉండదని, ఆదాయం పడిపోతుందనే ఉద్దేశ్యంతో ఆయన డిప్యూటేషన్‌పై కొనసాగేందుకు ఉన్నత స్థాయి అధికారులు కూడా మద్దతు పలకడం విస్మయం కలిగిస్తోంది. ఆ అధికారిని డిప్యూటేషన్‌పై ఇక్కడే నియమించడంపై హెచ్‌ఎంలు, ఎంఇవోలు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. నేరుగా ప్రభుత్వానికి ఫిర్యాదు చేసేందుకు సిద్ధం అయినట్లు సమాచారం.

ఆది నుంచి వివాదాస్పదమే

ఆ ద్వితీయ శ్రేణి అధికారి తీరు మొదటి నుంచి వివాదాస్పదమే. సాక్షాత్తు ఇక్కడ పనిచేసే ఉద్యోగులపై ఆయన కర్రపెత్తనం చేస్తాడని, పైసలిచ్చిన ఫైల్స్‌కు మాత్రమే క్లియరెన్స్ ఇస్తారని ప్రచారం ఉంది. ప్రైవేటు పాఠశాలల అనుమతులు వారికి జారీ చేయాల్సిన ఎన్‌వోసీల విషయంలో భారీ మొత్తంలో వసూళ్ళు చేసి కార్యాలయంలో వాటాలు రూపంలో పంపిణీ చేస్తారని ప్రచారం.

- ఎంఈవోలుగా పని చేసిన వారికి ఎఫ్ఏసీ అలవెన్స్‌ల మంజూరులో ఆయన వ్యవహరించిన తీరు తీవ్ర దుమారం రేపింది. ఎఫ్ ఏసీలుగా పని కాలానికి ఎంఈవోలకు చెల్లించాల్సిన నగదు విషయంలో ఆయన వేసిన కొర్రీలు వివాదస్పదమయ్యాయి. చివరకు ఎంఈ వోలు కోర్టులో తేల్చుకుంటామంటూ ఉన్నతాధికారులకు స్పష్టం చేయడంతో చివరకు వారికి ఎఫ్ఏసీ అలవెన్స్‌లు చెల్లించారు.
- కార్యాలయానికి వచ్చే హెచ్‌ఎంలను, ఎంఈవోలను అనేక విధాలుగా ఇబ్బందులకు గురిచేస్తాడనే ఆరోపణలు ఉన్నాయి. చిన్న విషయాలను కూడా భూతద్దంలో చూపి విచారణ పేరుతో భయభ్రాంతులకు గురిచేస్తాడని ఎయిడెడ్, హెచ్‌ఎంలు చెబుతున్నారు.
- ఈ అధికారి కార్యాలయానికి 12 గంటలకు వస్తారు. రాత్రి 9 గంటల వరకు ఉంటాడు. ఆయన ఉన్నంత వరకు మహిళా సిబ్బంది సైతం కార్యాలయంలో ఉండాలని హుంకుం జారీచేస్తాడనే ఫిర్యాదులు ఉన్నాయి. ఇలాంటి అధికారికి ఇక్కడే కొనసాగేలా ఉన్నతాధికారులు మద్దతు ఇవ్వడం అనేక అనుమానాలకు తావిస్తోంది.




కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, ప్రొఫెసర్ పీఎస్ పాల్ కుమార్, నాతాని వెంకటేశ్వర్లు తదితరులు, పోటీలో తలపడుతున్న బాపట్ల ఇంజనీరింగ్ , బాపట్ల ఉమెన్స్ కాలేజీ జట్లు

క్రీడలలో రాణించిన వారికి ప్రత్యేక స్థానం

అంతర కళాశాలల మహిళా కబడ్డీ పోటీలను ప్రారంభించిన కోటేశ్వరరావు

నరసరావుపేట టౌన్, నవంబరు 12 (ఆంధ్రప్రదేశ్) : ఉద్యోగ పోటీ ప్రపంచంలో క్రీడలలో రాణించిన వారికి ప్రత్యేక స్థానం ఉంటుందని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్శిటీ అంతర కళాశాలల మహిళా కబడ్డీ పోటీలను మంగళవారం స్థానిక కృష్ణవేణి డిగ్రీ కళాశాల ఆవరణలో ఆయన ప్రారంభించారు. కోటేశ్వరరావు మాట్లాడుతూ క్రీడ లలో ప్రతి విద్యార్థి తమ ప్రతిభను కనబరచాలన్నారు. ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలలో కూడా విద్యార్థులు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించాలని అన్నారు. తమ కళాశాలలో ప్రతి సంవత్సరం ఒక క్రీడకు ఆతిథ్యమిస్తూ విద్యార్థుల ప్రతిభ నైపుణ్యానికి తగిన శిక్షణ ఇస్తున్నామని అన్నారు. ఈ టోర్నమెంట్‌లో మొత్తం 11 జట్లు పాల్గొన్నాయి. మొదటి రౌండ్‌లో బాపట్ల ఇంజనీరింగ్ కాలేజీపై బాపట్ల ఉమెన్స్ కాలేజీ 10 పాయింట్ల తేడాతో, మరో జట్టు వాగ్దేవి డిగ్రీ కళా శాలపై ఎంఎఎం ఫార్మసీ జట్టు నాలుగు పాయింట్లు తేడాతో గెలుపొందాయి. ధనలక్ష్మి ఫిజికల్ ఎడ్యు కేషన్ కాలేజీపై విక్టరీ డిగ్రీ కాలేజీ గెలుపొందింది. మరో మ్యాచ్‌లో ఎంఎఎం కాలేజీ జట్టుపై కృష్ణవేణి డిగ్రీ కాలేజీ జట్టు భారీ ఆధిక్యతతో లీగ్‌లో ప్రవేశించింది. కార్యక్రమంలో ఎఎన్‌యు ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ పీపీఎస్ పాల్ కుమార్, కళాశాల డైరెక్టర్ కే నాసరయ్య, ధనలక్ష్మి ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ చుండు వెంకటరావు, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ, కళాశాల పీడీ ఈదర ఆదిబాబు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు మబీన్

అమరావతి, నవంబరు 12: ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి అండర్-17 బేస్‌బాల్ పోటీలకు స్థానిక శ్రీరామకృష్ణ హిందూ హైస్కూల్ విద్యార్థి పి.మబీన్ ఎంపికైనట్లు పీఈటీ అనూరాధ తెలిపారు. ఈ నెల 9,10,11 తేదీలలో యనమదలలో జరిగిన రాష్ట్ర జట్టు ఎంపికలో మబీనాను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మబీన్‌కు పాఠశాల బోధనాసిబ్బంది, విద్యార్థినీవిద్యార్థులు అభినందనలు తెలిపారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం మంగళవారం నాటికి 586.80 అడుగులు ఉంది. ఇది 304.80 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10,200 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 3849 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,78 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 400 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 45,634 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో మంగళవారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నాయి. ఎగువ నుంచి పూర్తి స్థాయిలో నీటి ప్రవాహం నిలిచి పోయింది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా రెండు వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నారు.

వివాహిత ఆత్మహత్య



స్వప్న మృతదేహం

దుర్గి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని పోలేపల్లిలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన చెన్నూరి స్వప్న (32) కుటుంబ కలహాలతో మనస్తాపం చెందింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మాచర్లలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి ఇద్దరు సంతానం.

టీడీపీ కార్యకర్తపై హత్యాయత్నం కేసులో ఐదుగురు అరెస్టు

కొల్లిపర, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బొమ్మువానిపాలెం ఇసుకరీచ్‌లో టీడీపీ కార్యకర్త తూమాటి రాజేంద్రప్రసాద్‌పై మూకుమ్మడిగా దాడి చేయడంతో పాటు ట్రాక్టర్‌తో ఢీ కొట్టి హత్యాయత్నం చేయబోయిన కేసులో ఐదుగురిని అరెస్టు చేసినట్లు మంగళవారం ఎస్ఐ కోటేశ్వరరావు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం బొమ్మువానిపాలెం ఇసుకరీచ్‌లో తూమాటి రాజేంద్రప్రసాద్‌పై వైసీపీకి చెందిన దూసరి అనిల్, దూసరి బాజీ, యద్దు కిశోర్, తూమాటి అజయ్ బాబు, పిల్లి హరీష్‌తో పాటు మరో నలుగురు ట్రాక్టర్‌తో ఢీ కొట్టి విచక్షణా రహితంగా దాడి చేశారు. బాధితుడు రాజేంద్రప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. దూసరి అనిల్, దూసరి బాజీ, యద్దు కిశోర్, తూమాటి అజయ్‌బాబు, పిల్లి హరీష్‌లను తెనాలి రెండవ అదనపు సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరచగా, వారికి 14 రోజుల రిమాండ్ విధించారు. వీరిని నరసరావుపేట సబ్‌జైలుకు పంపించినట్లు ఎస్ఐ తెలిపారు. మిగిలిన నలుగురు నిందితులు పరారీలో ఉన్నారని, వారి కోసం గాలిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మేనకోడలకు మాయమాటలు చెప్పి మేనమామ మోసం

- గర్భవతిగా నిర్ధారించిన వైద్యులు

తెనాలి మారీసుపేట,భట్టిప్రోలు (కొల్లూరు) నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మేనకోడలికి మాయమాటలు చెప్పి లోబరుచుకుని గర్భవతిని చేసిన మేనమామ ఉదంతం మంగళవారం వెలుగు చూసింది. యువతి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం, భట్టి ప్రోలుకు చెందిన యువతి తల్లి మృతి చెందాడు. ఆమె తండ్రి బతుకుదెరువు నిమిత్తం అదిలాబాద్‌కు వెళ్లాడు. పెద్దమేనమామ వద్ద ఆ యువతి ఉంటోంది. చిన్న మేనమామ తరచూ అక్కడికి వెళ్లి ఆ యువతికి మాయమాటలు చెప్పి లోబరచుకున్నాడు. యువతి ఆలనాపాలనా చూస్తున్న ఆమె పిన్ని యువతిలో శారీరక మార్పులు చోటు చేసు కోవడంపై ప్రశ్నించింది. కడుపునొప్పి, నడుమునొప్పి అని చెబుతున్న ఆమెను చెరుకుపల్లి మండలం కనగాలలోని ప్రభుత్వ వైద్యశాలకు తీసుకువెళ్లగా యువతికి పరీక్షలు చేసి తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లాలని సిఫార్సు చేశారు. అక్కడ వైద్య పరీక్షలు చేసిన వైద్యులు ఆ యువతిని గర్భవతిగా నిర్ధారించారు. ఈ విషయం తెలుసుకున్న యువతి చిన్నమ్మ, చినమేనమామే ఇందుకు కారణం అని పేర్కొంది. ఈ ఘటన గురించి వైద్యులు పోలీసులకు సమాచారం అందించారు. వైద్యశాలకు వెళ్లి వివరాలు సేకరించిన పోలీసులు ఈ ఉదంతం తమ పరిధి కాదని భట్టిప్రోలు పోలీసు స్టేషన్ పరిధిలోకి వస్తుందని వైద్యులకు తెలిపారు. ఈ విషయమై భట్టిప్రోలు పోలీసులను వివరణ కోరగా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఫిర్యాదు వస్తే దర్యాప్తు చేస్తామని తెలిపారు.



విలేకరుల సమావేశంలో మట్లాడుతున్న కేసన శంకరరావు

కష్టకాలంలో అందరూమెచ్చిన బడ్జెట్

రేపల్లెనవంబరు12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్ అందరూ మెచ్చేదిగా ఉందని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమసంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు అన్నారు. నిజాంపట్నం మండలం బొర్రావారిపాలెంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ఆర్థిక అరాచకంతో ఆరాచఅగాథంలో కూరుకుపోయిన రాష్ట్ర ఆర్థిక రథాన్ని మళ్ళీ గాడినపెట్టి ముందుకు నడి పించేందుకు చంద్రబాబునాయుడు నేతృత్వంలో ఆర్థికమంత్రి పయ్యావుల కేశవులు ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్నివర్గాల ప్రజలను ఆదుకునేలా జనరంజకంగా ఉందని కొనియాడారు. 8 నెలల ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌కు ముగింపు పలికి అసాధారణ పరిస్థితుల్లో చివరి నాలుగునెలలే ఉన్నా 2024-25ఆర్థికసంవత్సరం ఎన్నోగడ్డుపరిస్థితులు ఎదుర్కొంటూ కూడా రూ2.1 లక్షల కోట్లు ఆదాయం మరో రూ.93 వేల కోట్ల అప్పుల అంచనాలతో 2.94 లక్షల కోట్లతో పద్దును రూపొందించడం ఎంతో సాహసంతో కూడిందని ప్రశంసించారు. అమరావతి, పోలవరాలను త్వరితగతిన పూర్తి చేసేందుకు బడ్జెట్‌లో కేటాయింపులు ఆశాజనంగా ఉన్నాయని అన్నారు. బలహీన వర్గాలు, దళితులు, గిరిజనులు,మైనార్టీలు,అగ్రవర్ణపేదలకు వారి జనాబా దామాషా మేరకు ప్రత్యేక బడ్జెట్ కేటాయింపులు జరపడం, సూపర్‌సిక్స్‌లో భాగంగా 'తల్లికి వందనం', 'మహిళలకు ఉచిత బస్సు'కు నిధులు కేటాయింపు అభినందనీయమన్నారు.



నందూరులో పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం, ఎండీయూ వాహనం

53 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

పొన్నూరుటౌన్, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నండూరులో అక్రమంగా నిల్వ వుంచిన 53 క్వింటాళ్ల రేషన్ బియ్యంను రూరల్ పోలీసులు సోమవారం అర్ధరాత్రి స్వాధీనం చేసుకున్నారు. రూరల్ ఎస్సై గండు కిరణ్ కథనం ప్రకారం మండల పరిధిలోని నండూరులో రేషన్ బియ్యం నిల్వ ఉన్నట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు గ్రామానికి చేరకుని సోదాలు నిర్వహించారు. ఓ ఇంట్లో 105 బస్తాల్లో నిల్వ ఉన్న 53 క్వింటాళ్ల రేషన్ బియ్యం గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అదే ప్రాంతంలో నిలిపివున్న ఎండీయూ వాహనాన్ని సైతం స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. స్వాధీనం చేసుకున్న ఎండియూను రెవెన్యూ అధికారులకు అందించారు.

ఇసుక అక్రమంగా తరలిస్తున్న 11 లారీలు పట్టివేత

అమరావతి, నవంబరు 11: ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి అర్ధరాత్రి సమయంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న 11 లారీలను సత్తెనపల్లి డీఎస్పీ ఎం. హనుమంతరావు పర్యవేక్షణలో ప్రత్యేక టీం కాపుకాసి లారీలను అదుపులోకి తీసుకుంది. తుళ్లూరు మండలం బోరుపాలెం నుండి ఇసుకను అక్రమంగా వడ్లమాను రోడ్డులో డంపింగ్ చేసి దానిని లారీల్లో లోడింగ్ చేసి గుంటూరుకు తరలిస్తున్నారు. ఈ సమాచారం తెలుసుకున్న డీఎస్పీ తన ప్రత్యేక బృందంతో గుంటూరు రోడ్డులో కాపుకాసి అర్ధరాత్రి సమయంలో ఇసుకతో వస్తున్న 11లారీలను పట్టుకుని, అమరావతి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అందులో ఒకలారీ దిడుగు నుండి ఇసుకను లోడ్ చేసుకుని వస్తుండగా సత్తెనపల్లి రోడ్డులోని ఆరుడొంకల బావివద్ద పట్టుబడింది. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని డీఎస్పీ హెచ్చరించారు.

తెనాలి రైల్వేస్టేషన్‌లో రూ.35 లక్షల వెండి పట్టివేత



వివరాలు వెల్లడిస్తున్న జీఆర్‌పీ ఎస్ఐ వెంకటాద్రి

తెనాలి క్రైం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : తమిళనాడులోని సేలం నుండి అక్రమంగా వెండిని తరలిస్తున్న వ్యక్తిని తెనాలి రైల్వే స్టేషన్‌లో జీఆర్‌పీ పోలీసులు చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు. జీఆర్‌పీ ఎస్ఐ జి.వెంకటాద్రి తెలిపిన వివరాల ప్రకారం, సేలంకి చెందిన హరేరాం మంగళవారం ఉదయం 10.30 గంటల సమయంలో శబరి ఎక్స్‌ప్రెస్‌లో 4వ నంబరు ప్లాట్‌ఫారంపై దిగివస్తుండగా సాధారణ తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్ఐ వెంకటాద్రి అతనిని ఆపి అతని వద్ద ఉన్న రెండు బ్యాగులను తనిఖీ చేశారు. అందులో 38 కిలోల బరువు కలిగిన రూ.35 లక్షల వెండి వస్తువులు లభించాయి. నిందితుడు వీటికి సంబంధించి సరైన రశీదులు చూపించకపోవడంతో అక్రమ రవాణాగా భావించి వాటిని ఇన్ కంటాక్స్ డిపార్ట్‌మెంట్‌కి స్వాధీనం చేసి నట్లు చెప్పారు. అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలకు ఆస్కారం లేకుండా రైల్వే స్టేషన్‌లో ప్రత్యేక నిఘా వ్యవస్థ కొనసాగుతుందన్నారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు. సిబ్బంది మూర్తి, సురేంద్ర, శ్రీనివాస్, దివ్య పాల్గొన్నారు.




రాయల్‌మెరైన్ లారీ , నుజ్జునుజ్జయిన ఆటోలో ఇరుక్కుపోయిన హరీష్ మృతదేహం

రోడ్డుప్రమాదంలో ఇద్దరు మృతి

- బుద్దాం మలుపులో ఆటోను ఢీ కొట్టిన లారీ
- ఆటోడ్రైవర్ మృతి, చికిత్స పొందుతూ మరొకరు
- ఏడుగురికి తీవ్రగాయాలు



బాడిగా హరీష్ (ఫైల్‌ఫొటో)

కర్లపాలెం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందిన సంఘటన కర్లపాలెం మండలంలోని బుద్దాం మలుపు దగ్గర మంగళవారం జరిగింది. కర్లపాలెం ఎస్సై రవీంద్ర కథనం ప్రకారం కర్లపాలెంకు చెందిన బాడిగ హరీష్ (29) ఆటోడ్రైవర్ .అయ్యప్పమాల దీక్షలో ఉన్నారు. కర్లపాలెం నుంచి ఆటోలో ప్రయాణికులను ఎక్కించుకొని చందోలు నుంచి వెళుతూ బుద్దాం దగ్గర ప్రయాణికులు దిగేందుకు ఆపాడు. వారి వద్ద డబ్బులు తీసుకుంటుండగా, చందోలు నుంచి కర్లపాలెం వైపు వస్తున్న రాయల్ మెరైన్ లారీకి ఎదురు బైక్ రావడంతో దానిని తప్పించేందుకు లారీ డ్రైవర్ సడన్ బ్రేక్.. హ్యాండ్ బ్రేక్ వేశాడు. ఈ క్రమంలో లారీ వెనుకభాగం తగిలిన ఆటో నుజ్జునుజ్జయింది. ఈ ఘటనలో ఆటో డ్రైవర్ మృతి చెందాడు. ఆటోలోని 8 మంది ప్రయాణికులకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కర్లపాలెం పోలీసు వాహనంలో బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వం ఆసుపత్రికి తరలిస్తుండగా దేవరకొండ వెంకటేశ్ మృతి చెందాడు. ఖాజీపాలెంకు చెందిన బెజ్జం ఇందిరా, బుద్దాంకు చెందిన మద్దిబోయన శ్రీనివాసరావు, రాయగడ్‌కు చెందిన హబ్బి అకాష్, గణపవరం చెందిన దేవరకొండ గణేష్, పశ్చిమబెంగాల్‌కు చెందిన నిశి పొన్నవార్, ప్రశాంత్ పొన్నవార్, మేన కలకు తీవ్ర గాయాలయ్యాయి. సంఘటనా స్థలాన్ని బాపట్ల డీఎస్పీ జి. రామాంజనేయులు, సీఐ బి.హరికృష్ణ, తహసీల్దార్ సుందరమ్మ, ఎస్సై రవీంద్ర సందర్శించి అవసరమైన చర్యలు చేపట్టారు. ఈ ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. డ్రైవర్ పరారీలో ఉన్నాడని, లారీని స్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు మృతుడు .దేవరకొండ వెంకటేష్‌కు భార్య జయశ్రీ, ముగ్గురు పిల్లలు హర్ష, భరత్, ఆదిత్య ఉన్నారు.

జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు మబీన్

అమరావతి, నవంబరు 12: ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి అండర్-17 బేస్‌బాల్ పోటీలకు స్థానిక శ్రీరామకృష్ణ హిందూ హైస్కూల్ విద్యార్థి పి.మబీన్ ఎంపికైనట్లు పీఈటీ అనూరాధ తెలిపారు. ఈ నెల 9,10,11 తేదీలలో యనమదలలో జరిగిన రాష్ట్ర జట్టు ఎంపికలో మబీనాను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మబీన్‌కు పాఠశాల బోధనా సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు అభినందనలు తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.35
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	125, 134,145
చికెన్ విత్ స్కిన్	236.00
చికెన్ స్కిన్ లెస్	246.00

50,805 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 53,507 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 50,805 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 28,674 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	8000	15500	334	8000	16000
నెంబరు. 5	9000	13000	నెంబరు. 5	9500	12500
273	9000	12000	273	11000	13000
341	8200	14500	341	8500	15000
4884	9500	12000	4884	11700	14500
సూపర్ 10	-	-	సూపర్ 10	12000	12000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	8000	17000	తేజ	8000	17500
బ్యాడిగి	8000	14000	బ్యాడిగి	8500	13000
దేవనూరు డీలక్స్	8500	14000	దేవనూరు డీలక్స్	8000	15000
తెల్లకాయలు	5000	11000	తెల్లకాయలు	5000	10700

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు కీర్తన



కర్లపాలెం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) అండర్ -14 బాలురు కబడ్డీ పోటీలలో పేరలి గ్రామం జిల్లా పరిషత్ హైస్కూల్ 9వ తరగతి విద్యార్థిని కీర్తన జాతీయ స్థాయి కబడ్డీ పోటీకలు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు యు.అపర్ణ తెలిపారు. పిట్టలవానిపాలెం మండలంలో జరిగిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలలో కీర్తన గుంటూరు జిల్లా బాలికల జట్టుకు ప్రాతినిధ్యం వహించి గుంటూరు జిల్లా కబడ్డీ జట్టు మూడో స్థాయిలో నిలువుటకు ముఖ్య భూమిక పోషించి రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్లు పీడీ నర్రా తిరుపతిరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, ఎస్ఎంసీ కమిటీ, గ్రామ పెద్దలుతదితరులు కీర్తన జాతీయ స్థాయి కబడ్డీ పోటీలలో రాణించాలని ఆకాంక్షించారు.

కబడ్డీ పోటీలకు మున్సిపల్ హైస్కూల్ విద్యార్థుల ఎంపిక

బాపట్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు బాపట్ల మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు ఇద్దరు ఎంపికయ్యారు. ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు పిట్టలవానిపాలెంలో జరిగిన అంతర్‌జిల్లాల కబడ్డీ పోటీలలో గుంటూరు జిల్లా జట్టు తృతీయ స్థానం కైవశం చేసుకుంది. జట్టులో అత్యుత్తమ ప్రతిభను కనబరిచిన 8వ తరగతి విద్యార్థులు శీలం హేమంతరెడ్డి, ఎస్‌కే జుబేర్‌లను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో విద్యార్థులను ప్రధానోపాధ్యాయురాలు బి.రాజశ్రీ, పీడీ కత్తి శ్రీనివాసరావు, సీనియర్ క్రీడాకారులు మంతెన సుబ్బరాజు, సాంబశివరావు, నాగుల్ తదితరులు అభినందించారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

బాపట్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని నారాయణస్కూల్‌లో మంగళవారం సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమానికి పట్టణ ఎస్‌ఐ విజయ్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని సమాజంలో జరుగుతున్న వివిధ నేరాలపై అవగాహన కల్పించారు. బాల్యవివాహాలు, మహిళా భద్రత, గుడ్‌టచ్,బ్యాడ్‌టచ్, రోడ్డుభద్రతా నియమావళి తదితర కార్యక్రమాలు గురించి వివరించారు. ఎవరైనా బాల్యవివాహాలు చేసుకుంటున్నట్టు తెలిస్తే 1098కి సమాచారం ఇవ్వాలన్నారు. సైబర్ నేరాలకు గురైతే 1930కి, పోలీసు సహాయం పొందేందుకు 112కు కాల్ చేయాలని ఆయన వివరించారు.

పాఠశాలలను తనిఖీ చేసిన ఎంఈవో

పిట్టలవానిపాలెం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని భవనంవారిపాలెం గ్రామపంచాయతీలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను పిట్టలవానిపాలెం మండల విద్యాశాఖాధికారి-1 ఉయ్యూరి వెంకటేశ్వరరావు మంగళవారం సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థులకు పాఠశాలలో బోధనాపరమైన అంశాలపై ప్రధానోపాధ్యాయురాలు కె.షీలారాణి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎండీఎం నిర్వాహకులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

హైవే రోడ్డుపై విగ్రహాలు పెట్టరాదు

● బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు విన్నకోట

బాపట్ల, నవంరు 12 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారి మధ్యలో విగ్రహాలు నెలకొల్పే విషయమై సుప్రీంకోర్టు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ హైకోర్టుల ఉత్తర్వుల ప్రకారం నిషేధం ఉన్నట్లు బాపట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విన్నకోట సత్యప్రసాద్ తెలిపారు. ఈ విషయాన్ని కలెక్టర్ జె.వెంకటమురళీ దృష్టికి వినతిపత్రం ద్వారా ఆయన తీసుకెళ్ళారు. అదేవిధంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, రాష్ట్ర ప్రిన్సిపాల్ సెక్రటరి, ఆర్అండ్‌బి అధికారులకు లేఖ ద్వారా పంపినట్లు ఆయన వివరించారు. కోర్టు ఉత్తర్వులు ప్రకారం విగ్రహాలు నెలకొల్పే విషయమై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

మద్యం విక్రేత అరెస్టు

కొల్లూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ రవి తెలిపారు. మండల పరిధిలోని ఈపూరులో బెల్టు షాపు నిర్వహిస్తు అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు మంగళవారం సమాచారం అందడంతో సిఐ సిబ్బందితో ఆకస్మిక దాడులు జరిపారు. దాడిలో 8 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని విక్రయదారునిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

నేడు పెసర్లంకలో ఉచిత కంటి వైద్య శిబిరం

భట్టిప్రోలు (కొల్లూరు), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఉచిత వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్లు యన్నం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ యన్నం సురేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని పెసర్లంకలో ఎల్‌వి ప్రసాద్ కంటి వైద్యశాల గూడవల్లి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శుక్లాలు ముదిరిన వారికి ఉచితంగా శస్త్ర చికిత్స చేస్తారన్నారు. 60 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు కళ్లజోళ్లు ఉచితంగా ఇస్తారని పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

దేవస్థానం స్థలం లీజువేలం వాయిదా

పిట్టలవానిపాలెం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : చందోలులో ఉన్న శ్రీలింగోద్భవస్వామి దేవస్థానానికి సంబంధించిన ఖాళీ స్థలం లీజువేలంపాట మంగళవారం జరగాల్సి ఉండగా అనివార్యకారణాల వల్ల వాయిదా పడిందని త్రిముఖ దేవాలయాలకు చెందిన కార్యనిర్వాహణాధికారి కె.నాగేశ్వరరావు తెలిపారు.

విద్యుదాఘాతానికి పూరిల్లు దగ్ధం

కొల్లూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని తోకలవానిపాలెంలో మంగళవారం పులిపాటి నాగరాజుకు చెందిన పూరింటిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు చెలరేగి దగ్ధమైంది. సమాచారం తెలుసుకున్న సర్పంచ్ టి.కృష్ణమోహన్ బాధిత కుటుంబానికి తనవంతుగా 25 కేజీలు బియ్యం, విద్యుత్ సర్వీసు వైరు అందజేశారు. వీఆర్వో వెంకటరత్నం ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం వచ్చే విధంగా కృషి చేస్తానని అన్నారు.

యథేచ్ఛగా అక్రమ కట్టడాలు

● పట్టించుకోని మున్సిపల్ అధికారులు

బాపట్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల పట్టణంలో అక్రమ కట్టడాలకు హద్దుఅదుపు లేకుండా పోయింది. వైసీపీ పాలనలో విచ్చలవిడిగా నిర్మాణాలు జరిగాయి. కూటమి పాలనలో మొదట అక్రమ కట్టడాలపై కన్నెర్ర చేసిన అధికారులు ప్రస్తుతం పట్టించుకోకపోవటంతో అక్రమార్కులు ఇష్టానుసారంగా నిర్మాణాలు చేస్తున్నారు. అయినప్పటికీ అధికారులు ఏమాత్రం చర్యలు తీసుకోవటంలేదనే విమర్శలు వస్తున్నాయి. అసలే పురపాలక సంఘం 14 కోట్ల రూపాయల అప్పులలో ఉందని చెప్పే అధికారులు అక్రమ కట్టడాలను అరికట్టి నిర్మాణాలకు అనుమతులు ఇచ్చేవిధంగా చర్యలు చేపడితే పురపాలక సంఘానికి ఆదాయం వస్తుంది. అయితే ఆ దిశగా ఇక్కడ చర్యలు చేపట్టటంలేదు. దీంతో అక్రమార్కులు ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపడుతున్నారు. ముఖ్యంగా ప్లాన్ ఒకవిధంగా తీసుకొని నిర్మాణాలు మరో విధంగా చేపడుతున్నారు. రెండు అంతస్థుల నిర్మాణానికి ప్లాన్ తీసుకొని నాలుగు అంతస్థులు నిర్మిస్తున్నారు. మూడుప్లాన్‌లు తీసుకొని మూడు కలిపి ఒకే భవనంగా నిర్మిస్తున్నారు. ఇలాంటివి అధికారులకు మాత్రం కనిపించటం లేదు. కర్లపాలెం రోడ్డులోని మార్కెట్ యార్డు ఎదురు జాతీయ రహదారి పక్కనే నిర్మాణం జరుగుతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు. పట్టణ నడిబొడ్డున ఎల్ఐసీ కార్యాలయం రోడ్డులో వన్‌వే పక్కన నిర్మాణం జరుగుతున్నా పట్టించుకోవటంలేదు. దీనివల్ల రోజురోజుకు అక్రమ నిర్మాణాలు జరుగుతూనే ఉన్నాయి. అధికారులు చేతివాటం ప్రదర్శించి ఈవిధంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు ఉన్నాయి. కాగా ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ జి.రఘునాధరెడ్డిని వివరణ కోరగా కట్టడాలను పరిశీలిచామని వాటిపై చర్యలకు సిద్ధమయ్యామని చెప్పారు.



బాపట్లలోని ఎల్ఐసీ కార్యాలయం రోడ్డులో వన్‌వే రోడ్డు పక్కనే మూడు ప్లాన్‌లు తీసుకొని ఒకే భవనం నిర్మిస్తున్న చిత్రం



బాపట్ల వ్యవసాయ మార్కెటింగ్‌యార్డు దగ్గర హైవేరోడ్డు పక్కనే నిర్మిస్తున్న బహుళ అంతస్థుల భవనం

కూటమి పాలనలో దళితులకు సముచితస్థానం

● సలగలకు పెద్ద ఎత్తున సన్మానాలు

బాపట్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా నియమితులైన సలగల రాజశేఖర్‌బాబును మంగళవారం పెద్దఎత్తున సత్కరించి సన్మానించారు. కూటమినాయకులతోపాటు దళిత సంఘాలనాయకులు కూడా తరలివచ్చి ఆయనను ఘనంగా సత్కరించారు. కూటమి ప్రభుత్వంలో దళితులకు సముచిత స్థానం కల్పించారని పలువురు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర మహిళా ఆర్గనైజింగ్ సెక్రటరి మానం విజేత, ఎన్టీఆర్ కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు చంద్ర ప్రసాద్, మానం విజయ్‌కుమార్, మాజీ ఎంపీపీ దాసరి యోహాను, బాపట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విన్నకోట సత్యప్రసాద్, అడ్వకేట్ కంచర్ల అవినాష్, అంటరానితన నిర్మూలన పోరాటసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జి.చార్వాక, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ పేరలి సునీల్‌కుమార్, సీనియర్ నాయకులు ఎ.గోపికృష్ణ, భోగిరెడ్డి రమేష్‌రెడ్డి, గుంటా రాములు, శేఖర్, బెంజి, శరత్‌చందు, హరిప్రసాద్, దగ్గుమళ్ళ సుబాషణరావు తదితరులు ఉన్నారు.



రాజశేఖరబాబుకు మొక్క అందజేస్తున్న మాజీ ఎంపీపీ మానం విజేత తదితరులు



రాజశేఖరబాబును సన్మానిస్తున్న డాక్టర్ జి.చార్వాక, దళిత సంఘాల నాయకులు

● కర్లపాలెం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ రాజశేఖరబాబును కర్లపాలెం మండల టీడీపీ నేతలు మంగళవారం ఆయన స్వగ్రామంలో కలిసి దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించి మొక్కలను అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో బాపట్ల పార్లమెంట్ ఉపాధ్యక్షుడు నక్కల వెంకటస్వామి, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు ఏపూరి భూపతిరావు, మాజీ ఎంపీటీసీలు షేక్ బాజి, ప్రకాశరావు, బుల్లియ్య, చిట్టిబాబు, నక్కల అయ్యప్ప పాల్గొన్నారు.

14 నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

కర్లపాలెం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు జరుగుతాయని కర్లపాలెం శాఖా గ్రంథాలయ అధికారి టీవీ రమణమ్మ తెలిపారు. ఈనెల 14వ తేదీ బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయ ఉద్యమకారుల స్మారకసభ, విద్యార్థులకు క్విజ్ పోటీలు, 17న కవిసమ్మేళనాలు, 18న విద్యార్థులకు ఆటలు, వ్యాసరచన పోటీలు, 19న మహిళా దినోత్సవం, 20వ తేదీన వివిధ పోటీలలో పాల్గొన్న విద్యార్థినీ, విద్యార్థులకు బహుమతుల ప్రదానం జరుగుతుందని గ్రంథాలయాధికారి చెప్పారు.

● భట్టిప్రోలు, కొల్లూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు కొల్లూరు, భట్టిప్రోలు, శాఖ గ్రంథాలయ అధికారులు వై.రాంబాబు, కె.సుభాష్ చంద్రబోస్ తెలిపారు. 14న బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శనతో పాటు వ్యాసరచన పోటీలు, 16న వక్తృత్వ పోటీలు, 17న దేశభక్తి గీతాల పోటీలు, 18న చిత్రలేఖనం, 19న రంగవల్లుల పోటీలు జరుగుతాయని తెలిపారు. 20న ఆయా పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతి ప్రదానం జరుగుతుందని గ్రంథాలయ అధికారులు పేర్కొన్నారు.

● అమృతలూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయ 57వ జాతీయ వారోత్సవాలు ఈనెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ నిర్వాహకురాలు శ్రీదేవి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు, మహిళలకు పలు పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. 20న ఉత్సవాలు ముగింపు సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు.

● పిట్టలవానిపాలెం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా మంగళవారం గ్రంథాలయాధికారి ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మండల విద్యాశాఖాధికారి-1, 2 ఉయ్యూరి వెంకటేశ్వరరావు, కె.రాజారత్నంలచే గ్రంథాలయ వారోత్సవాల బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎం.చినసుబ్బారెడ్డి, పిఆర్పీలు ఎం.ముసలయ్య, కమల, స్రవంతి, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులు



జీబీసీ రోడ్డులో లీక్ అయిన పైపులైన్ మరమ్మతులు చేసేందుకు తవ్వుతున్న గుంత

బాపట్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని జీబీసీ రోడ్డులో తూర్పుసత్రం ఎదురు తాగునీటి పైపులైన్‌కు లీక్ ఏర్పడింది. స్థానికులు గుర్తించి సమాచారం ఇవ్వటంతో మున్సిపల్ కమిషనర్ జి.రఘునాధరెడ్డి ఆదేశాల మేరకు పైపులైన్ మరమ్మతులు చేపట్టారు. ఇప్పటికే అనేక ప్రాంతాలలో పైపులైన్‌లకు లీకులు ఏర్పడి తాగునీటి సరఫరాలో అవాంతరాలు ఏర్పడుతున్నాయి. తాజాగా ఇక్కడ ఏర్పడిన లీకునకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయించి నీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని కమిషనర్ ఆదేశించారు.

వైభవంగా కార్తీక దీపోత్సవం



బాపట్ల పట్టణంలోని చీలురోడ్డు సెంటర్‌లో శ్రీపాండురంగస్వామి దేవాలయంలో కార్తీకదీపాలు వెలిగిస్తున్న భక్తులు

బాపట్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని చీలురోడ్డు సెంటర్‌లో ఉన్న శ్రీపాండురంగస్వామి దేవాలయంలో క్షీరాబ్ది ద్వాదశి సందర్భంగా మంగళవారం సాయంత్రం కార్తీక దీపోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారిని దర్శించి దీపారాధన చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. వివిధ ఆకారాలలో దీపాలు వెలిగించటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమాన్ని గంటా సాయిబాబు కుటుంబం నిర్వహించగా అర్చకులు రొంపిచర్ల కేశవాచార్యులు, మేదూరి వెంకటఅప్పలచార్యులు, ఆలయ ధర్మకర్త ఎం.బద్రినారాయణ తదితరులు పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో గీతా కర్పూర యజ్ఞం

కొల్లూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : అత్యంత భక్తి శ్రద్ధలతో గీతా కర్పూర యజ్ఞం నిర్వహించారు. భట్టిప్రోలులోని సాధన మండలి బ్రహ్మ విద్యాశ్రమంలో బూరెల అరుణకుమారి, ఆశ్రమ మహిళా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం 247వ గీతా కర్పూర యజ్ఞం నిర్వహించారు. వెయ్యి మంది భక్తులకు కార్తీక వన సమారాధన నిర్వహించారు. విశ్రాంత ఉపాధ్యాయులు మాజేటి వెంకటేశ్వరరావు, బాపట్ల తపోవనం వాసుదేవస్వామిజీ, గుంటూరు, కృష్ణా జిల్లాల దాన సాహిత్య ప్రాజెక్టు తిరుమల, తిరుపతి దేవస్థాన అధ్యక్షుడు గడ్డిపాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అల్పపీడనంతో వాతావరణంలో మార్పు... రైతుల్లో ఆందోళన

● యంత్ర సహాయంతో హడావుడిగా నూర్పిళ్లు



జంపనిలో యంత్ర సహాయంతో వరి నూర్పిడి చేస్తున్న చిత్రం

వేమూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ సాగులో వరి పైర్లు కోతకు వచ్చిన తరుణంలో బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావం వల్ల మంగళవారం వాతావరణంలో మార్పు ఏర్పడింది. అక్కడక్కడ చెదురు మదురు జల్లులు పడ్డాయి. దీంతో ఆందోళన చెందిన రైతులు కొందరు హడావుడిగా యంత్రాల సహాయంతో నూర్పిళ్లు చేశారు. 20వ తేదీ నుంచి కోతలు, నూర్పిళ్లు ప్రారంభిద్దామనుకున్న రైతులకు వాతావరణంలో మార్పు గుబులు పుట్టించింది. 24 గంటల్లోగా వర్షాలు పడతాయని వాతావరణ శాఖ ప్రకటించడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. వర్షాలు పడేటట్లయితే పంట చేతికి చిక్కే అవకాశం లేకుండాపోతుందని, తీవ్ర నష్టం వాటిల్లుతుందని భయాందోళనలకు గురవుతున్నారు.

పంట పొలాలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

అమృతలూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పెదపూడిలో వరి పంట పొలాలను శాస్త్రవేత్తలు మంగళవారం పరిశీలించారు. ఇటీవల గ్రామంలోని రైతులు తమ వరి పంటలో తాలు కంకులు ఎక్కువగా వస్తున్నాయని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దీంతో క్షేత్ర స్థాయిలో పంట పొలాలను శాస్త్రవేత్తలు కృష్ణవేణి, పి.మధువాణి, కామాక్షి వరి పంటను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఏడీఏ లక్ష్మి, ఏడీఏ శ్రీ అక్తర్‌హుస్సేన్, ఏవో లోకేశ్వరి, ఏఈవో శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందజేత

అమృతలూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : బాలల దినోత్సవం పురస్కరించుకుని విద్యా ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. మండల పరిధిలోని యలవర్రులో మంగళవారం జరిగిన కార్యక్రమంలో గ్రేసి అల్ఫోన్స్ స్టడీ సర్కిల్‌లో చదువుతున్న 60 మంది విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు తదితర సామగ్రిని కురగంటి రాజేంద్రప్రసాద్, జంగం మేరీ కిషోర్ చేతుల మీదగా అందజేశారు. కార్యక్రమంలో మండే వికాస్, జి.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శ్రీనివాస్‌గౌడ్

బాపట్లనవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నువ్వుల శ్రీనివాస్‌గౌడ్‌ను, గౌరవాధ్యక్షుడిగా వడ్డమూడి నాగరాజును నియమించారు. శ్రీశైలంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ నూతన కార్యవర్గ సమావేశం, శిక్షణ తరగతులలో వీరిని నియమిస్తూ నియామకపత్రాలను సంఘ నాయకులు అందజేశారు. సంఘ సంక్షేమంతోపాటు ప్రజల అభ్యున్నతికి తమవంతు కృషి చేస్తామని వారు తెలిపారు. నియామక పత్రాలు అందజేసిన వారిలో రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ లాకా వెంగళరావు యాదవ్ తదితరులు ఉన్నారు.

సామాజిక న్యాయంతో కూడిన ఆర్థికాభివృద్ధి లక్ష్యం కావాలి : ఎంపీడీవో

బాపట్లరూరల్,నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సామాజిక న్యాయంతో కూడిన ఆర్థికాభివృద్ధి మన లక్ష్యం కావాలని ఎంపీడీవో బాబురావు అన్నారు. మంగళవారం గ్రామపంచాయతీల అభివృద్ధి ప్రణాళిక 2025-2026 తయారి ప్రకియ గురించి బాపట్ల మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, డిజిటల్ అసిస్టెంట్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈశిక్షణ కార్యక్రమంలో ఎంపిడివో మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్రప్రభుత్వాలు అందిస్తున్న నిధులతోపాటు అందుబాటులో ఉండే వనరులతో ప్రజల అవసరాలను ప్రాధాన్యతా క్రమంలో తీర్చేందుకు గ్రామపంచాయతీల అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలని చెప్పారు. ప్రజలకు ఆర్థికాభివృద్ధితోపాటు సామాజిక న్యాయం కూడా దక్కేవిధంగా ప్రణాళికలకు రూపకల్పన చేయాలన్నారు. ఈకార్యక్రమంలోమంలో ఈవోపిఆర్డీ పులి శరత్‌బాబు, ఎంఇవో నిరంజన్, ఇ.టి.సి ప్రతినిధి గంగవరపు కెజియా, డిపిఆర్సి ఏ.జి.డి.జె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అవరోధించాలి

రేపల్లె, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు విద్యతోపాటు క్రీడలు, సాంస్కృతిక, పెయింటింగ్‌లో రాణించాలని ఎంసిఏ సెక్రటరీ పరుచూరి శ్రీనివాసరావు అన్నారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం విద్యార్థినీ, విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్, సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వందలాదిమంది విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ విద్యార్థులు తల్లిదండ్రుల కలలను సాకారం చేసే దిశగా ముందుకు వెళ్ళాలన్నారు. ఈ పోటీల్లో ప్రతిభకనబరిచిన విద్యార్థినీ, విద్యార్థులకు బాలల దినోత్సవం రోజున బహుమతులు అందించనున్నట్లు తెలిపారు.

చందోలు పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ రామాంజనేయులు

పిట్టలవానిపాలెం, నవంరు 12 (ఆంధ్రజ్యోతి) : చందోలు పోలీసుస్టేషన్‌లో పోలీసుల పనితీరు బాగుందని బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు అన్నారు. వార్షిక తనిఖీలలో భాగంగా రికార్డులను డీఎస్పీ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కేసులు పురోగతిని డీఎస్పీ రామాంజనేయులు చందోలు ఎస్‌ఐ ఆర్.స్వామి శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకొని వాటి పరిష్కార మార్గాలకు పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో బాపట్ల రూరల్ సీఐ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు మహ్మద్ షాజద్‌కు పలువురి అభినందనలు

పిట్టలవానిపాలెం, నవంరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందోలు గ్రామపంచాయతీలోని రసూల్‌పేట మండలపరిషత్ ఉర్దూ పాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయుడు మహ్మద్‌షాజద్‌కు జాతీయ విద్యాదినోత్సవం సందర్భంగా 2024 ఉర్దూ అకాడమి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్‌కళ్యాణ్ చేతులమీదగా అందుకున్నారు. విజయవాడలో విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్, పలువురు ఎమ్మెల్యేలు, ముఖ్యనాయకులు, విద్యావంతుల సమక్షంలో రాష్ట్రస్థాయి ఉర్దూ ఉపా ధ్యాయ అవార్డు అందుకోవటంపై ఉపాధ్యాయులు షాజద్‌కు అభినందనలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో విశ్రాంత ఉపాధ్యాయుడికి గాయాలు

బాపట్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కొత్త బస్టాండ్ దగ్గరలో పాండురంగస్వామి గుడి ఎదురు సైకిల్‌పై వెళుతున్న విశ్రాంత ఉపాధ్యాయుడు శివయ్యను కర్లపాలెం వైపు నుంచి వస్తున్న కొబ్బరికాయల ఆటో ఢీకొట్టింది. శివయ్యకు తీవ్రగాయాలయ్యాయి. సైకిల్‌ను ఢీకొట్టిన ఆటో తిరగబడి పక్కనే సిమెంట్ దుకాణంలో ఉన్న కారును కూడా ఢీకొట్టింది. క్షతగాత్రుడిని చికిత్సనిమిత్తం ఏరియావైద్యశాలకు తరలించారు.

గుంతల రోడ్డుకు మరమ్మతులు జరిగేనా!





ఇండస్ట్రీయల్ ఎస్టేట్, ఆర్టీసీ గ్యారేజికి వెళ్ళే రోడ్డు శిథిలమై గుంతలుగా ఏర్పడిన చిత్రం

బాపట్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల పట్టణంలోని ఇండస్ట్రీయల్ ఎస్టేట్‌కు వెళ్ళే ప్రధాన రహదారి శిథిలమై గుంతలుగా మారింది. ఈ ప్రాంతంలోని పరిశ్రమలకు, ఆర్టీసీ గ్యారేజికి వెళ్ళే వాహనాలు ఈ గుంతల వల్ల మరమ్మతులకు గురవుతున్నాయి. బస్సులతోపాటు అనేక ప్రాంతాలకు ఇక్కడ పరిశ్రమలు నుంచి ఉత్పత్తులు ఎగుమతి, దిగుమతులు అవుతుంటాయి. ఒకప్పుడు బీటి రోడ్డుగా ఉన్న ఇది కనీసం గ్రావెల్ రోడ్డుగా కూడా లేదు. వర్షం వస్తే గుంతలలో నీరు నిలిచి తటాకాన్ని తలపిస్తుంది. సంబంధితాధికారులు దీనిపై స్పందించి మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉంది.

హోం వ్యవహారాల పార్లమెంటరీ కమిటీ సమావేశంలో బాపట్ల ఎంపీ

బాపట్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : న్యూఢిల్లీ పార్లమెంట్ హాలులో హోం సెక్రటరి, జాయింట్ సెక్రటరి, ఇంటలిజెన్సీ బ్యూరో డైరెక్టర్ తదితరులతో జరిగిన హోం వ్యవహారాల పార్లమెంటరి కమిటీ సమావేశంలో బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ పాల్గొన్నారు. ఐపీఎస్ అధికారిగా, విశ్రాంత డీజీపీగా కృష్ణప్రసాద్ దేశ అంతర్గత భద్రత, భారతనేర న్యాయ వ్యవస్థ, విపత్తు నిర్వహణకు సంబంధించిన విషయాలలో తన ఆలోచనలను, సలహాలను సమావేశంలో ప్రస్తావించారు. ముఖ్యంగా ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో సంభవించిన వరద సమయంలో చేపట్టిన చర్యలు గురించి సమావేశంలో వివరించారు.



పార్లమెంట్ హాలులో జరిగిన హోం వ్యవహారాల పార్లమెంటరీ కమిటీ సమావేశంలో ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్

సముద్రస్నానాలు చేసే భక్తులకు రహదారి ఏర్పాట్లు



రహదారి పనులను పరిశీలిస్తున్న అనగాని శివప్రసాద్

రేపల్లెనవంబరు12 (ఆంధ్రజ్యోతి):కార్తీక మాసంలో పౌర్ణమిసందర్భంగా తీరప్రాంత ప్రజలు సముద్రపుణ్య స్నానాలు ఆచరించేందుకు దిండి నుంచి సముద్రం వరకు రహదారిని ఏర్పాటు చేస్తున్నామని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. నిజాంపట్నం మండలం దిండి గ్రామం నుంచి సముద్రం వరకు వేసే రహదారి అభివృద్ధి పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ భక్తులు పెద్దసంఖ్యలో సముద్ర స్నానాలు చేసేందుకు వస్తారని రహదారి లేకపోవటంతో కిలోమీటర్ల నడవాల్సిన పరిస్థితి నెలకొందని అన్నారు. ఆ సమస్యను పరిష్కరించేందుకు నేరుగా వాహన చోదకులు సముద్రం వరకు వెళ్ళే విధంగా రహదారిని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ చక్రవర్తి, స్థానిక టీడీపీ నాయకులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి

● గైర్హాజరైన అధికారులకు నోటీసులు ఇవ్వాలి : ఎంపీపీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ లలితకుమారి

భట్టిప్రోలు (కొల్లూ రు), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రభు త్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివ రిం చా లని ఎంపీపీ రావూరి వెంకటలలితకుమారి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ, మండల గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తమ దృష్టికి తీసుకు వస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కొన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమావేశానికి గైర్హాజరు కావడం గుర్తించిన ఎంపీపీ వారికి నోటీసులు ఇవ్వాలని ఎంపీడీవోకు సూచించారు. యానిమేటర్ల అవినీతిపై ప్రస్తావన రావడంతో ఏపీఎం శ్రీమన్నారాయణ ఒకరిద్దరిపై ఆరోపణలు ఉన్నాయని, నివేదిక అందిన వెంటనే తెలియజేస్తామని వివరించారు. సమావేశంలో మండల ఉపాధ్యక్షులు కొతరపు పిచ్చయ్య శాస్త్రి, మల్లోలు ఉషారాణి, ఈవోపిఆర్‌డి ఊహారాణి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులకు పెరిగిన పని భారం

● జిల్లా సచివాలయ ఉద్యోగుల ఫెడరేషన్ నాయకుడు హరికృష్ణ

వేమూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం సచివాలయ ఉద్యోగులకు రోజు రోజుకు పని భారం పెంచడం వల్ల సంబంధిత ఉద్యోగులు ఇబ్బందులకు గురవుతున్నారని బాపట్ల జిల్లా సచివాలయ ఉద్యోగుల ఫెడరేషన్ నాయకుడు హరికృష్ణ ఆవేదన వ్యక్తపరిచారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, ప్రస్తుతం సచివాలయ ఉద్యోగుల ద్వారా గ్రామాల్లో హౌస్, జియో ట్యాగింగ్ పనితో పాటు ఆధార్ కార్డును బ్యాంకు ఖాతాకు జమ చేసే పనిని చేపట్టారని ఇదే సందర్భంగా స్కిల్స్ సర్వే కూడా ప్రారంభం కాబోతోందన్నారు. ఇంజనీరింగ్ విభాగానికి చెందిన సిబ్బంది రోడ్ల నిర్మాణాలు, ఇతర అభివృద్ధి పనులు పర్యవేక్షణ చేస్తున్నారు. వెల్ఫేర్ అసిస్టెంట్లు పాఠశాలల పరిరక్షణ బాధ్యత నిర్వహిస్తున్నారు. ఇన్ని బాధ్యతలు నిర్వర్తిస్తున్న తరుణంలోనే అదనంగా ఇసుక రీచ్‌ల వద్ద డ్యూటీలు వేశారు. సచివాలయ మహిళా ఉద్యోగులను కూడా ఈ డ్యూటీలకు వినియోగిస్తున్నారు. ఉన్నతాధికారులు ఆలోచన చేసి విధులు నిర్వహించే విషయంలో మార్పులు తెచ్చి సహకరించాలని కోరారు.

విస్తృతంగా విజిలెన్స్ తనిఖీలు

కొల్లూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. మండల పరిధిలోని రావిలంక, చిలుమూరు, ఈపూరు, గాజుల్లంక, కొల్లూరు, కోటిపల్లి, పెదలంక, అనంతవరం గ్రామాల్లో మంగళవారం జిల్లా పర్యవేక్షక ఇంజనీర్ కెవిఎల్ఎన్ మూర్తి ఆధ్వర్యంలో 70 బృందాలుగా ఏర్పడి 5434 విద్యుత్ సర్వీసులను తనిఖీ చేశారు. తనిఖీల అనంతరం స్థానిక ఎంప్లాయీస్ రిక్రియేషన్ క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో విద్యుత్ శాఖాధికారులు వివరాలు వెల్లడించారు. విద్యుత్ చౌర్యం, ఇతర కార్యకలాపాలకు పాల్పడుతున్న వారికి రూ.10.64 లక్షల అపరాధ రుసుం విధించారు. తనిఖీల్లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సీహెచ్ వెంకటేశ్వరరావు, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చిరంజీవి, డీఈఈలు మల్లికార్జున ప్రసాద్, కె.రాజశేఖర్, ఏఈలు సతీష్‌కుమార్, శివశంకర్, కె.సుధాకరబాబు, అదనంగా మరో 70 మంది అధికారులు, 210 మంది సిబ్బంది పాల్గొన్నారు.

అసభ్యంగా పోస్టులు పెడితే ఉపేక్షించం : ఎస్ఐ

నగరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులు పెడితే ఉపేక్షించేదిలేదని ఎస్ఐ బి.భార్గవ్ అన్నారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ ఐటీడీపీ ఇన్‌చార్జ్ జిజ్జూరు బాలనరేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు షేక్ మహ్మద్‌ఖాజా, మొహీద్దీన్, షాన్‌జాను, నరసరావుపేటకు చెందిన వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

విద్యార్థుల ప్రతిభ వెలికితీసేందుకే టాలెంట్ టెస్టులు

నగరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): టాలెంట్ టెస్టు ద్వారా విద్యార్థినీ, విద్యార్థుల్లోని దాగి ఉన్న ప్రతిభ బయటకు తీసే అవకాశం ఉంటుందని జడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బద్రీనారాయణ అన్నారు. పాఠశాలలో 5వ తరగతి విద్యార్థులకు మంగళవారం టాలెంట్ టెస్టు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ, విద్యార్థులకు బహుమతులను అందిం చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్‌సుబ్బారావు, ఉపాధ్యాయుడు నెహ్రూ పాల్గొన్నారు.



..రయ్‌రయ్

(5వ పేజీ తరువాయి)

పురుషోత్తమపట్నం, చిలకలూరిపేట, గణపవరం, నాదెండ్ల వద్ద అండర్ పాస్‌ల నిర్మాణం చేశారు. బొప్పూడి, కోటప్పకొండ, గణపవరం, నాదెండ్ల ప్రాంతాల్లో 8 బస్ షెల్టర్లు నిర్మించారు. రోడ్డుకు ఒకవైపున ప్రధాన సర్వీస్ రోడ్డు ఉంటుంది. అండర్ పాస్‌ల వద్ద రెండు వైపులా సర్వీస్ రోడ్లు ఏర్పాటు చేశారు. కాంట్రాక్టర్లు 15 సంవత్సరాల పాటు ఈ రోడ్డు నిర్వహణ పనులు చేయాల్సి ఉంటుంది. బైపాస్ రోడ్డుకు రెండు వైపులా 16 కిలోమీటర్ల పొడవునా శాశ్వత గోడ నిర్మాణం చేశారు. పశువులు రోడ్డుపైకి రాకుండా ఉండడానికి, ఆక్రమణలను అరికట్టడానికి, ప్రమాదాల నివారణకు ఈ గోడను నిర్మించారు. రోడ్డు పక్కన గణపవరం వద్ద హైవేస్‌కు చెందిన విశాలమైన ప్రదేశం రెండు చోట్ల ఉంది. దీంతో దానిని సద్వినియోగం చేసుకునేందుకు ఒక మెగా వాట్ సోలార్ ప్లాంటును ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం అక్కడ సోలార్ ప్లేట్లను బిగిస్తున్నారు. దీని ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను పగటి వేళలో గ్రిడ్‌కు అనుసంధానం చేసి, రాత్రిళ్లు రోడ్డుపై లైట్ల వెలుగులకు వినియోగించనున్నారు. బైపాస్ రోడ్డు పొడవునా ఒకవైపున 3,500 మొక్కలను నాటుతున్నారు. వాటిలో గానుగ, వేప, నల్లమద్ది, గుల్మోరా, పెంట్ ఫామ్ జాతుల మొక్కలు ఉన్నాయి. ప్రతి మొక్కకు ట్రీ గార్డును ఏర్పాటు చేస్తున్నారు. వీటికి నిత్యం నీటిని అందించి సంరక్షించేందుకు రెండు చోట్ల బోరు పాయింట్లు ఏర్పాటు చేసి ట్యాంకర్ల ద్వారా నీటిని అందించే ఏర్పాటు చేశారు. రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్లపై కాగితం పూల మొక్కలను నాటారు.

నాణ్యతా ప్రమాణాల తనిఖీలు

రోడ్డు నిర్మాణం పనులు పూర్తయినట్లుగా బీఎస్‌సీపీఎల్ కంపెనీ కాంట్రాక్టర్లు నేషనల్ హైవే సంస్థకు నివేదించారు. దీంతో హైవేస్ అధికారులు పనుల నాణ్యతా ప్రమాణాల పరిశీలన చేస్తున్నారు. పరిశీలన అనంతరం రోడ్డు ప్రారంభోత్సవానికి పచ్చజెండా ఊపుతారు. ఇప్పటికే నేషనల్ హైవేస్ ప్రాజెక్టు డైరెక్టర్ పార్వతీశం ఆధ్వర్యంలో రోడ్డు తనిఖీ జరిగింది. బైపాస్ రోడ్డులో అత్యంత ఆధునాతనమైన ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఎక్కడికక్కడ కెమెరాల ఏర్పాటు జరిగింది. వాహనాల వేగంపై కన్నేసి ఉంచేందుకు ప్రత్యేక పరికరాలు బిగించారు. ఎప్పటికప్పుడు ఈ సమాచారం గుంటూరు విజయవాడ మధ్య ఉన్న కాజ టోల్‌గేట్ వద్దకు చేరే విధంగా ఏర్పాటు జరిగింది.

టోల్‌గేట్‌లేని మార్గంగా బైపాస్


చిలకలూరిపేట వద్ద బైపాస్ రోడ్డు నిర్మాణం పూర్తయినా ఈ మార్గంలో టోల్‌గేట్ ఉండదని అధికారులు స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించిన వ్యయాన్ని రాబట్టుకోవడానికి గుంటూరు విజయవాడ మధ్య ఉన్న కాజ టోల్‌గేట్ వద్ద రేట్లను పెంచవచ్చని సమాచారం.

చిలకలూరిపేట ప్రజలకు తప్పనున్న తిప్పలు

బైపాస్ రోడ్డుపై అధికారికంగా రాకపోకలకు అనుమతిస్తే చిలకలూరిపేట ప్రజలకు ఊరట లభిస్తుంది. ప్రస్తుతం పట్టణం మధ్యగా వెళ్లే జాతీయ రహదారిపై మూడు ప్రధాన సెంటర్లలో నిత్యం ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతున్నది. దీనివల్ల ఒంగోలు గుంటూరు మధ్య ప్రయాణం చేసే వారికి సుమారు 30 నిమిషాల సమయం వృథా అవుతున్నది. పట్టణ ప్రజలు రోడ్డు దాటి వెళ్లాలంటే కనీసం 20 నిమిషాల సమయం పడుతున్నది. దీనికి తోడు తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. పలువురు ప్రాణాలు కోల్పోతున్నారు. బైపాస్ రోడ్డును ప్రారంభిస్తే అధిక శాతం వాహనాలు ఆ మార్గంలో వెళ్తాయి కాబట్టి పట్టణ ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు తొలగిపోతాయి. కాలుష్యం సమస్యకు కూడా తెరపడుతుంది.

భారత్-ఈ జట్టులో

అఖిల పావనికి స్థానం




మంగళగిరి సిటీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మంగళగిరికిచెందిన మహిళా క్రికెటర్ కడియం వాసవి అఖిల పావని భారత్- ఈ మహిళల జట్టులో స్థానం సంపాదించింది. బీసీసీఐ ఆధ్వర్యంలో గత నెల 17 నుంచి వివిధ వేదికలపై సీనియర్ మహిళా టీ-20 టోర్నీ జరిగింది. ఈ టోర్నీలో అత్యుత్తమ ప్రదర్శన చేసిన 75 మందిని బీసీసీఐ ఎంపిక చేసింది. వీరిని ఏ, బీ, సీ, డీ, ఈ జట్లుగా విభజించింది. ఝార్ఖండ్ రాష్ట్రం రాంచీ వేదికగా ఈ నెల 17 నుంచి జరుగనున్న చాలెంజర్స్ ట్రోఫీలో ఈ జట్లు తలపడ తాయి. బీసీసీఐ సీనియర్ మహిళా టీ-20లో వాసవి అఖిల పావని ఆంధ్రా జట్టు తరపున ఆడి మొదటి స్థానం, దక్షిణ భారత దేశంలో రెండవ స్థానం, జాతీయస్థాయిలో 15వ స్థానంలో నిలిచి చాలెంజర్స్ ట్రోఫీలో ఇండియా-ఈ జట్టుకు ఎంపికైంది. చాలెంజర్స్ ట్రోఫీలో మంచి ప్రతిభ కనబరిస్తే నేరుగా భారత మహిళల జట్టు లేదా మహిళల ఐపీఎల్ జట్లకు ఎంపికయ్యే అవకాశం ఉంది. పావనికి పలువురు ప్రముఖులు అభినందనలు తెలిపారు.



పరీక్షలను పరిశీలిస్తున్న కోఆర్డినేటర్ ఆచార్య ఎం సుబ్బారావు

బీఈడీ పరీక్షలు ప్రారంభం

పెదకాకాని, నవంబర్ 12(ఆంధ్ర జ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలో బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయని పీజీ పరీక్షల తాత్కాలిక కో-ఆర్డినేటర్ ఆచార్య ఎం.సుబ్బారావు తెలిపారు. వర్సిటీ ఎదురుగా ఉన్న ప్రభల డిగ్రీ కళాశాలలో హైకోర్టు ఆదేశాలతో ఆరు కళాశాలలకు ఈ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు.



స్నిగ్ధ యోగాసనం

శరీరాన్ని అలవోకగా మెలికలు తిప్పగలదు. అతిక్లిష్టమైన యోగాసనాలను సైతం అత్యంత సులువుగా వేయగలదు. కేవలం ఆసనాలు వేయడమే కాదు.. కూచిపూడి నృత్యంలోనూ ప్రవేశం ఉంది. విభిన్నరంగాల్లో తన ప్రతిభను కనబరుస్తూ ప్రశంసలు పొందుతున్న పదిహేనేళ్ల బాలిక పేరు స్నిగ్ధ. బాపట్ల వాసి అయిన స్నిగ్ధ పలు వేదికలపై తన ఘనతను చాటుతోంది.

ఎస్‌జీఎఫ్‌ఐలో పాల్గొనాలి : స్నిగ్ధ

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించే యోగా పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటడంతో పాటు యోగాలో ఎంఎస్‌ఈ డిగ్రీ అందుకోవాలనేది నా కోరిక. అందుకు అనుగుణంగానే కష్టపడుతున్నాను. మైసూర్ నేషనల్స్ కాంపిటీషన్‌లో సెకండ్ ప్రైజ్ దక్కించుకున్నాను. ఆల్‌ఓవర్ సెంట్రల్ స్కూల్ స్టేట్ కాంపిటీషన్‌తో పాటు నేషనల్ ఒలింపియాడ్ పోటీల్లో సెకండ్ ప్రైజ్ గెలుచుకున్నాను. డిస్ట్రిక్ట్ యోగా కాంపిటీషన్‌లో ప్రథమ బహుమతితో పాటు శాప్ పోటీల్లో తొలి బహుమతి దక్కించుకు న్నాను. రీజినల్ నేషనల్స్‌లో 3 సార్లు పాల్గొంటే ఒకసారి సిల్వర్, రెండు సార్లు గోల్డ్ మెడల్ గెలుచుకున్నాను. నేషనల్ స్టాండ్‌బైలో థర్డ్‌ప్రైజ్ వచ్చింది. ఇవన్నీ కూడా బెంగుళూరు, మైసూర్, హైదరాబాద్ వేదికగా జరిగిన పోటీలే కావడంతో కేంద్రీయ విద్యాలయం టీచర్ల దగ్గర నుంచి కూడా నాకు పూర్తిగా సపోర్ట్ ఉండేది. ముఖ్యంగా ఇప్పుడు ఉన్న ప్రిన్సిపల్ మేడం అన్ని విధాలుగా సహకారం అందిస్తున్నారు.



కూచిపూడి నాట్యంతో అలరిస్తున్న స్నిగ్ధ

నేషనల్ కాంపిటీషన్‌లో గెలుచుకున్న మెడల్‌తో స్నిగ్ధ

యోగ స్నిగ్ధ ముద్ర



- అలవోకగా ఆసనాలు.
- కూచిపూడి నృత్యంలోనూ ప్రవేశం
- ప్రతిభ చాటుతున్న విద్యార్థి స్నిగ్ధ

గురువు శిక్షణ.. అమ్మానాన్నల ప్రోత్సాహం

చిన్నప్పటి నుంచి గురువు ఖాదర్‌వలీ శిక్షణకు తోడు అమ్మానాన్నలు మాధురి, వెంకట కృష్ణప్రసాద్ ఇచ్చిన ప్రోత్సాహమే తనను యోగావైపు అడుగులేసేలా చేసింది. ఎక్కడ పోటీలు జరిగినా అమ్మే తోడుగా వచ్చేది. చదువును, యోగాను ఈ రెండింటిని బ్యాలెన్స్ చేసుకోవడంలో అమ్మ గైడెన్స్, నాన్న ఇచ్చే ధైర్యం ఎంతగానో ఉపయోగపడు తోంది. కూచిపూడి నృత్యం నేర్చుకున్నా. క్లాసికల్ డ్యాన్స్‌లో కూచిపూడి నృత్యం కూడా నేర్చుకుని ప్రదర్శనలిచ్చాను. కోర్సు పూర్తి చేసి నాంపల్లి పొట్టి శ్రీరాములు యూనివర్సిటీ నుంచి సర్టిఫికెట్ అందుకున్నాను.

బాపట్ల, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : మూడో తరగతి నుంచే యోగాపై ఆసక్తి కనబరిచిన బాలిక స్నిగ్ధ ప్రస్తుతం పదో తరగతి చదువుతోంది. యోగాలో తాను సాధించిన విజయాలతో పాటు ఎన్నో విషయాలను ఆ చిన్నారి 'ఆంధ్రజ్యోతి'తో పంచుకుంది. ఆ వివరాలు స్నిగ్ధ మాటల్లోనే..

నేను కేంద్రీయ విద్యాలయంలో మూడో తరగతి చదువుతున్నప్పుడే సీనియర్లు యోగా చేయడం చూశాను. అప్పటి నుంచే ఆసక్తి మొదలైంది. క్రమేపీ యోగాపై మరింత శ్రద్ధ పెరిగింది. అలవోకగా ఆసనాలు వేయడం చూసిన ఖాదర్ వలీ మాస్టారు నాకు శిక్షణ ఇచ్చారు. మరింతగా ప్రోత్సహించారు. నేను మూడో తరగతిలో ఉన్నప్పుడు నుంచి నాకు ఆయనే యోగా గురువు. ఆసక్తి ఉన్న వారికి ఉచితంగానే మాస్టారు యోగా నేర్పించేవారు. సమయపాలనలో కఠినంగా ఉండేవారు. ఇప్పటికీ మాస్టారు ఆసనాలు వేసి నేర్పిస్తుంటారు.

ఆటలకు దూరమే..

మూడో తరగతి నుంచే ఆటలపై ఆసక్తి అంతగా ఉండేది కాదు. తోటి విద్యార్థులందరూ ఆటల కోసం గ్రౌండ్‌కు వెళితే నేను మాత్రం సాయింత్రం 5 గంటలు కాగానే మేట్ బ్యాగ్ తగిలించుకుని యోగా తరగతులకు వెళుతుండేదానిని. కొన్ని ఆసనాలు నేర్చుకోవడంలో బాగా ఇబ్బంది పడేదాన్ని. ఓ ఆసనం విషయంలో ఓ కాలు ముందుకు చాపి, మరో కాలును వెనకి నుంచి చెవి దగ్గర తాకించాల్సి ఉంటుంది. అది నేర్చుకునే క్రమంలో నొప్పి భరించలేక ఏడ్చేశాను. యోగాపై ఉన్న ఇష్టం ముందు ఆ బాధ ఏమంత పెద్దగా అనిపించలేదు. అమ్మ మాత్రం నేను పడుతున్న కష్టం చూసి ఓ వారం పాటు నాతో శిక్షణ కేంద్రానికి రావడం మానేసింది. అయితే, నా ఇష్టాన్ని అర్థం చేసుకున్న అమ్మానాన్నలు తోడుగా నిలబడ్డారు.

నేను యోగా నేర్చుకోవడం మొదలుపెట్టినప్పుడు దీనిపై ఆసక్తి చాలా తక్కువ మందికి ఉండేది. కానీ, ఇప్పుడు అందరూ దీనిపై దృష్టిపెడుతున్నారు. ఆరోగ్య రీత్యా ఆసక్తి కనబరుస్తున్నారు. అంతర్జాతీయ వేదికలపైనా యోగా ప్రాచుర్యం పొందడం ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. యోగాను క్రీడగా గుర్తించడం వల్ల కూడా భవిష్యత్తులో స్పోర్ట్స్ కోటాలో అవకాశాలు అందిపుచ్చుకునేందుకు ఇది ఉపయోగడనుంది. ఇష్టంతో నేర్చుకున్న యోగ ఇప్పుడు ఎన్నో అవకాశాలకు వేదికగా నిలవడంతో పాటు రాబోయే రోజుల్లో కూడా ప్రాధాన్యం దక్కుతుందనిపిస్తోంది.





బాపట్ల కేంద్రీయ విద్యాలయంలో జరిగిన పోటీల్లో జడ్జీలతో చిన్నారి స్నిగ్ధ (ఫైల్)

ఏపీలో జపాన్ విద్యా విధానం



జపాన్ బృందానికి మెమొంటో అందజేస్తున్న ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య రామ్మోహన్‌రావు, వీసీ ఆచార్య గంగాధరరావు

- టోయామా యూనివర్సిటీతో ఒప్పందం
- విద్య, అధ్యాపక, పరిశోధనలకు ప్రణాళికలు
- ఏఎన్‌యూలో సమావేశం.. హాజరైన ఆరు వర్సిటీల వీసీలు

పెదకాకాని, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో జపాన్ విద్యా విధానం అమలు దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌తో జపాన్‌కు చెందిన టొయామా విశ్వవిద్యాలయంతో రాష్ట్ర ప్రభుత్వం 2015 చేసుకున్న ఒప్పందం తిరిగి తెరపైకి వచ్చింది. ఈ క్రమంలో మంగళవారం గుంటూరు సమీపంలోని ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలో జపాన్ బృందంతో ఏపీలోని ఆరు విశ్వవిద్యాలయాల ఉపకులపతులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా టోయామా యూనివర్సిటీతో ఆంధ్రప్రదేశ్‌లోని యూనివర్సిటీలు, విద్యార్థి, అధ్యాపక, పరిశోధన రంగాలలో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకునేందుకు అంగీకారం లభించింది. ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి చైర్మన్, పలు యూనివర్సిటీల వీసీలు తెలిపిన వివరాలను పరిశీలించిన జపాన్ ప్రతినిధుల బృందం సానుకూలంగా స్పందించింది. ఈ క్రమంలో కొలాబరేటివ్ డైలాగ్ ఆన్ ఎడ్యుకేషన్ బిట్వీన్ టోయామా ప్రీఫెక్చర్ అండ్ ఆంధ్రప్రదేశ్ అనే అంశంపై జరిగిన చర్చలో రాష్ట్ర ఉన్నత విద్యామండలి తాత్కాలిక చైర్మన్ ఆచార్య కే.రామ్మోహనరావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో జపాన్ దేశ విద్యా విధానాన్ని కొనసాగించే క్రమంలో ఆయా రాష్ట్రాల్లో ఉన్న జపాన్ విద్య విధానంపై ఏపీలో అమలు చేసే అంశాలను పరిశీలించనున్నట్లు తెలిపారు. 2047కి స్వర్ణాంధ్రప్రదేశ్ సాధనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తుందన్నారు. అందులో భాగంగా జపాన్ విద్యా విధానాన్ని రాష్ట్రంలో అమలుకు పరిశీలించాలని ముఖ్యమంత్రి సూచించినట్లు తెలిపారు. జపనీస్ భాషపై ప్రత్యేక కోర్సును విద్యార్థులకు అందించాలని కూడా సూచించారన్నారు. నాగార్జున యూనివర్సిటీ వీసీ ఆచార్య కే.గంగాధర రావు మాట్లాడుతూ వర్సిటీ నుంచి ఇద్దరు విద్యార్థులు సుకుర సైన్స్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాంలో భాగంగా టొయామ యూనివర్సిటీని సందర్శించి పలు అంశాల్లో నైపుణ్యాలు పెంచుకున్నారన్నారు. ఇంటర్నేషనల్ అఫైర్స్ డివిజన్ డైరెక్టర్ యూకో హోంగో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోని వర్సిటీలతో ఒప్పందాలకు తాము సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. వచ్చే నెలలో టొయామా గవర్నర్ ఆంధ్రప్రదేశ్ పర్యటన ఉంటుందని ఆపర్యటనలో ఒప్పందాలను ఖరారు చేసుకోనున్నట్లు తెలిపారు. యూజీ, పీజీ, రీసెర్చ్, సెంటర్ ఫర్ ఎక్సలెన్స్, సైన్స్ అండ్ టెక్నాలజీ, ఫార్మసీవంటి కోర్సులపై దృష్టిసారిస్తామన్నారు. కార్యక్రమంలో ఉన్నత విద్య మండలి వైస్ చైర్మన్ ఆచార్య ఉమామహేశ్వరిదేవి, ఇండస్ట్రియల్ లోకేషన్ అండ్ ట్రేడ్ డివిజన్ లాజిస్టిక్ అండ్‌ట్రేడ్ డైరెక్టర్ హిదేహిస, ఇంటర్నేషనల్ అఫైర్స్ డివిజన్ సెక్షన్ చీఫ్ ఏఐ డోబు, ఇంటర్నేషనల్ రిలేషన్స్ మాజీ కోఆర్డినేటర్ దాసరి రమేష్, పద్మావతి మహిళా వర్సిటీ వీసీ ఆచార్య వెన్నం ఉమ, వెంకటేశ్వర యూనివర్సిటీ వీసీ ఆచార్య సిహెచ్. అప్పారావు, ఆంధ్ర యూనివర్సిటీ రెక్టార్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబు, జేఎన్టీయూ అనంతపురం ఉపకులపతి ప్రొఫెసర్ హెచ్.సుదర్శన్‌రావు, జేఎన్టీయూ కాకినాడ ఉపకులపతి ప్రొఫెసర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ, నాగార్జున యూనివర్సిటీ రెక్టార్ ఆచార్య రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ ఎ.కృష్ణసత్య, ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ పి.పద్మావతి, ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఆచార్య సిద్ధయ్య, ఆచార్య ప్రమీలారాణి, వెంకటేశ్వర యూనివర్సిటీ నోడల్ ఆఫీసర్ ప్రొఫెసర్ రాజశేఖర్, ఇండో జపనీస్ కొలాబరేషన్ కన్సల్టెంట్ స్వాతి భగవత్ తదితరులు పాల్గొన్నారు.

చీఫ్‌విప్‌గా జీవీ

(5వ పేజీ తరువాయి)

చీఫ్‌విప్ పదవితో పార్టీ అధిష్ఠానం జీవీకి సముచిత స్థానం కల్పించింది. 2009, 2014లో జీవీ వినుకొండ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2019లో ఓటమి చెందారు. 2024 ఎన్నికల్లో పోటీ చేసి మూడోసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. టీడీపీలో వివిధ హోదాల్లో ఆయన పని చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లా, పల్నాడు జిల్లాకు టీడీపీ అధ్యక్షుడిగా దాదాపు పదేళ్ల బాధ్యతలు నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడి హోదాలో టీడీపీ సభ్యత్వ నమోదులో జీవీ పల్నాడు జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిపి అధిష్ఠానం మన్ననలు పొందారు. ఇక ఆయన ఐదేళ్ల వైసీపీ అరాచకాలకు ఎదురొడ్డి అనేక పోరాటాలు చేశారు. వైసీపీ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో శావల్యాపురం జడ్పీటీసీని గెలిపించి ప్రతిపక్షంలో కూడా ఆయన సత్తా చాటారు. జీవీకి పదవి దక్కడంపై టీడీపీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, పలువురు నేతలు జీవీని సత్కరించి ఆయనకు అభినందనలు తెలిపారు.

సమర్థవంతంగా నిర్వహిస్తా : జీవీ

చీఫ్‌విప్‌గా బాధ్యతలు అప్పగించిన సీఎం నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌లకు జీవీ కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానన్నారు. అధిష్ఠానం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని తెలిపారు. సహచర ఎమ్మెల్యేలకు పూర్తి స్థాయిలో సహాయ సహకారాలు అందిస్తానన్నారు. శాసన సభ విలువలు గౌరవం పెంచేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు.



సతీమణి లీలావతికి మిఠాయి తినిపిస్తున్న జీవీ

వినుకొండకు రెండోసారి పదవి

వినుకొండ నియోజకవర్గానికి రెండో సారి చీఫ్‌విప్ పదవి దక్కింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు వినుకొండ నుంచి అప్పట్లో ఎమ్మెల్యేగా గెలిచిన నన్నపనేని రాజకుమారి చీఫ్ విప్‌గా పని చేశారు. ఆ తర్వాత జీవీని ఆ పదవి వరించింది. నియోజకవర్గంలోని అన్ని మండలాల టీడీపీ అధ్యక్షులు, శావల్యాపురం జడ్పీటీసీ సభ్యురాలు పారా హైమావతి, మేజర్ పంచాయతీల్లోని పలువురు సర్పంచ్‌లు, టీడీపీ నేతలు ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులుకి అభినందనలు తెలిపారు.

పడవ రేవులకు గిరాకీ

- గింజుపల్లికి రూ.54 వేలు ఉంటే.. రూ.3.50 లక్షలకు పాట
- మాదిపాడుకు, తాడువాయి రేవులకు పోటాపోటీ
- వల్లభాపురానికి ఒక్కరు కూడా రాలేదు



జడ్పీ కార్యాలయంలో పడవ, బల్లకట్టు రేవులకు వేలం నిర్వహిస్తున్న డిప్యూటీ సీఈవో చొప్పర కృష్ణ


గుంటూరు సిటీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో ని పడవ, బల్లకట్టు రేవులకు గిరాకీ పెరిగింది. రెండు దఫాలుగా వాయిదా పడుతూ వచ్చిన వేలం మంగళవారం విజయవంతంగా పూర్తయ్యింది. జడ్పీ డిప్యూటీ సీఈవో చొప్పర కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన బహిరంగ వేలంలో రేవులు దక్కించుకునేందుకు పలువురు పోటీపడ్డారు. పెద్దగా ప్రాధాన్యం లేదనుకున్న అచ్చంపేట మండలంలోని రేవులకు భారీ మొత్తం చెల్లించేందుకు పలువురు ముందుకు వచ్చారు. అచ్చంపేట మండలం చామర్రు పడవ రేవుకు కనీస ధర రూ.1.15 లక్షలు నిర్ణయించగా, దానిని రూ.2.12 లక్షలకు జీ రామయ్య దక్కించుకున్నారు. చింతపల్లికి రూ.91667 అని నిర్ణయించగా, రూ.96000కు రమేష్ దక్కించుకున్నారు. గింజుపల్లికి 54,167 అని నిర్ణయించగా కే వసంతారావు 3.50 లక్షలకు దక్కించుకున్నారు. తాడువాయి రేవుకు రూ.4,72,083 కనీస ధర కాగా, రమేష్ అనే వ్యక్తి రూ.7 లక్షలకు దక్కించుకున్నారు. మాదిపాడు రేవుకు రూ.5,52,083 కనీస ధర కాగా, సతీశ్ కుమార్ అనే వ్యక్తి దానిని రూ.11.20 లక్షలకు దక్కించుకున్నారు. మాదిపాడు బల్లకట్టుకు రూ.4,16,667 కనీస ధరకాగా అబ్దుల్ సత్తార్ అనే వ్యక్తి రూ.4.27 లక్షలకు దక్కించుకున్నారు. మాచవరం మండలం లోని గోవిందాపురం బల్లకట్టుకు రూ.3,33,333 కనీస ధరగా నిర్ణయించగా వెంకటేశ్వర్లు అనే వ్యక్తి 3,45,000కి దక్కించుకున్నారు. అమరావతి మండలం లోని దిడుగు పడవ రేవుకు రూ.2,77,083 కనీస ధర కాగా చంద్రశేఖర్ అనే వ్యక్తి రూ.2,88,000కు దక్కించుకున్నారు. ధరణికోట పడవ రేవుకు రూ.20,833 కనీస ధరగా నిర్ణయించగా, గోవింద్ అనే వ్యక్తి రూ.76,000కు దక్కించుకున్నారు. కొల్లిపొర మండలంలోని వల్లభాపురం రేవుకు ఎవరూ ముందుకు రాలేదని కృష్ణ తెలిపారు.

ఏఎన్‌ఎంలకు ఇతర విధులు వద్దు..

- 'హంస' విజ్ఞప్తిపై స్పందించిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి

గుంటూరు సిటీ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో విధులు నిర్వహిస్తున్న ఏఎన్‌ఎంలను ఇతర విధులకు వినియోగించవద్దని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ కే.విజయలక్ష్మీ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. సచివాలయ పరిధిలో వస్తున్న వివిధరకాల సర్వేలకు ఏఎన్‌ఎంలు హాజరు కావాల్సిందే అంటూ పంచాయతీ సెక్రటరీలు ఒత్తిడి చేస్తున్నట్లు ఏపీ హంస యూనియన్ జిల్లావైద్య, ఆరోగ్యశాఖ అధికారిణి దృష్టికి తీసుకెళ్లారు. వారి విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి ఏఎన్‌ఎంలు నిర్వర్తించవలసిన విధులపై స్పష్టత ఇస్తూ ఉత్తర్వులు జారీచేశారు. గ్రేడ్-3 ఏఎన్‌ఎంలు సోమ, గురువారం అడల్ట్ బీసీజీ వాక్సినేషన్, బుధ, శనివారం రొటీన్ ఇమ్యునైజేషన్, శుక్రవారం ఫ్రైడే డ్రైడే మాత్రమే నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లు హంస అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బీ.నాగవర్ధన్ వెల్లడించారు. ఏఎన్‌ఎంలకు అనుకూలంగా ఉత్తర్వులు జారీచేసిన జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ కె విజయలక్ష్మీకి అసోసియేషన్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు

పట్టాయాలో జరిగిన ప్రపంచ బాడీ బిల్డింగ్ పోటీల్లో సాధించిన గోల్డ్ మెడల్ తో నిశ్శంకర్రావు రవికుమార్



థాయిలాండ్‌లో మెరిసిన

గుంటూరు కుర్రోడు

వరల్డ్ బాడీ బిల్డింగ్ పోటీల్లో స్వర్ణ పతకం సాధించిన రవికుమార్

గుంటూరుసిటీ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): థాయిలాండ్ పట్టాయాలో జరిగిన ప్రపంచ బాడీ బిల్డింగ్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ కీర్తి పతాకం అంబరాన్ని అంటింది. గుంటూరు జిల్లా ఏటుకూరుకు చెందిన నిశ్శంకర్రావు రవికుమార్ (రవి) 65-70 కేజీల విభాగంలో ప్రపంచ స్థాయిలో స్వర్ణ పతాకం సాధించారు. ఈనెల 9,10తేదీల్లో పట్టాయాలో ఈ పోటీలలో రవికుమార్ రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించారు. రవికుమార్ గతంలోనూపలు జాతీయ, అంత ర్జాతీయ బాడీబిల్డింగ్ పోటీల్లో పాల్గొని మెడల్స్ సాధించారు. 2018లో పూణేలో జరిగిన పోటీల్లో కాంస్యం, 2019లో ఇండోనేషియా జరిగిన పోటీల్లో స్వర్ణం, 2021లో ఉజ్బెకిస్తాన్‌లో జరిగిన పోటీల్లో కాంస్యం, 2022లో సౌత్ కొరియాలో జరిగిన పోటీల్లో కాంస్యం, 2023 లో ఫిలిప్పీన్స్‌లో జరిగిన పోటీల్లో ఏషియా సిల్వర్ మెడల్స్ సాధించారు. నిశ్శంకరరావు రవికుమార్ తండ్రి వెంకట్రావు లారీడ్రైవర్ కాగా, తల్లి నరసమ్మ గ్రామం లోనే చిన్న చిల్లరదుకాణం నడుపుతున్నారు. దిగువ మధ్య తరగతి కుటుంబానికి చెందిన ఈ యువ బాడీ బిల్డర్ గత తొమ్మిది సంవత్సరాలుగా కఠోర శిక్షణ తీసుకుంటున్నారు. థాయిలాండ్‌లో ఉన్న రవికుమార్ ఫోన్ లో 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ ప్రపంచ బాడీ బిల్డింగ్ పోటీలో స్వర్ణం సాధించటం సంతోషం కలిగించిందన్నారు. ప్రభుత్వం ప్రోత్సహిస్తే భవిష్యత్తులో మరిన్ని గోల్డ్‌మెడల్స్ తీసుకు వస్తానన్న దీమా వ్యక్తంచేశారు. గడచిన ఐదేళ్లలో ప్రభుత్వం ఏమాత్రం ఆదరణ చూపించలేదని ఆవేదన చెందారు. అప్పుడు ప్రభుత్వం చేయూత నిచ్చివుంటే రాష్ట్రానికి చాలా మెడల్స్ వచ్చి ఉండేవని అన్నారు. థాయ్‌లాండ్ నుంచి రాగానే ప్రభుత్వ పెద్దలను కలుస్తానని నిశ్శంకర్రావు రవికుమార్ తెలిపారు.



గతంలో సీఎం చంద్రబాబు నాయుడుని కలిసిన రవికుమార్


వివరాలను వెల్లడిస్తున్న సెయింట్ ఆన్స్ కళాశాల ప్రతినిధులు

నేడు వెయిట్ లిఫ్టింగ్ టోర్నమెంట్

చీరాల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో జేఎన్‌టీయూ (కె) కాకినాడ వారి ఇంటర్ కాలేజీ వెయిట్ లిఫ్టింగ్ టోర్నమెంట్, యూనివర్సిటీ టీం ఎంపిక మంగళవారం జరుగుతుందని కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు తెలిపారు. మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు వివరాలను వెల్లడించారు. టోర్నమెంట్‌లో పాల్గొనే క్రీడాకారులకు భోజన, వసతి సౌకర్యాలు కల్పించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జగదీష్ బాబు, వ్యాయామ ఉపాధ్యాయుడు అన్నం శ్రీనివాసరావులు తెలిపారు. క్రీడాకారులు ఉదయం 8 గంటలకు ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని సూచించారు.

అభివృద్ధి ప్రణాళికపై దృష్టి సారించండి

చీరాలటౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండల అభివృద్ధి ప్రణాళికపై ప్రత్యేక దృష్టిసారించాలని వేటపాలెం ఇన్‌చార్జి ఎంపీడీవో శివసుబ్రహ్మణ్యశర్మ అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సమావేశం హాలులో రెండు మండలాలకు సంబంధించి జీపీడీపీపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా అధికారులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం నుంచి గ్రామాల అభివృద్ధికి సంబంధించి ఏర్పాటు చేసిన ప్రణాళిక ఆధారంగానే నిధులు అందుతాయని వివరించారు. గ్రామ పంచాయతీ ప్రణాళిక అందించాల్సిన చివరితేదీ జనవరి 31 అని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎమ్ఈవో సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ నాగరాజు రెండు మండలాల పంచాయతీల కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

సంతమాగులూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయంలో ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు గ్రంథపాలకుడు బాదం విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. విద్యార్థులకు ప్రతిరోజు వివిధ రకాల ఆటలు, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామని ప్రతిభ చూపిన వారికి ముగింపు కార్యక్రమంలో బహుమతులను అందజేస్తారని తెలిపారు.

17న యద్దనపూడిలో ఉచిత కంటి వైద్య శిబిరం

యద్దనపూడి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : స్వర్గీయ ఏలూరి నాగేశ్వరరావు జ్ఞాపకార్థం ఏలూరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శంకర కంటి ఆస్పత్రి సహకారంతో ఈనెల 17వ తేదీ ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. యద్దనపూడిలోని జడ్పీ హైస్కూల్‌లో ఈ శిబిరం జరుగుతుందని ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయం మంగళవారం ప్రకటనలో తెలిపింది. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్యులు కంటి పరీక్షలు నిర్వహిస్తారన్నారు. వారిలో అవసరమైన వారికి ఆపరేషన్లు చేయడానికి ఎంపికచేస్తారన్నారు. ప్రజలు అవకాశాన్ని వినియోగించుకోవాలని క్యాంపు కార్యాలయం వారు తెలిపారు.

సుడి దోమపై అప్రమత్తం


అద్దంకిటౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : వరిలో సుడి దోమను గమనించి రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ సూచించారు. మంగళవారం మండలంలోని ధర్మవరం, శంఖవరప్పాడు గ్రామాల్లో వరి పైరును ఆయన పరిశీలించారు. అక్కడక్కడా సుడి దోమను అధికారులు గుర్తించారు. ప్రస్తుతం వాతావరణం సుడి దోమకు అనుకూలమని, దుబ్బుకు ఈనిక దశలో 20 నుంచి 25 దోమలను గమినించిన రైతులు వెంటనే సస్య రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. వేప నూనె 1500 పీపీఎం లీటరు నీటికి 5 ఎంఎల్ కలిపి పిచికారీ చేయాలన్నారు. ఇమిడాక్లోప్రిడ్ 0.5 ఎంఎల్ లీటర్ నీటికి లేదా ఎథిప్రోల్ 0.25 ఎంఎల్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. రబీ ఈ పంట నమోదు ఈ నెల 17 నుంచి ప్రారంభమవుతుందని వరి, మొక్కజొన్న, శనగ, మినుము సాగు చేసిన రైతులు ఈ పంట నమోదు చేసుకోలన్నారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి ఎస్.దీప్తి, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

రోటరీ ఆధ్వర్యంలో బధిరులకు అన్నదానం


అన్నదానం చేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

అద్దంకిటౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో మంగళవారం చైతన్య బధిరుల ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థులకు అన్నదానం నిర్వహించారు. సీనియర్ రోటేరియన్, వ్యాపారులు బిజ్జం వెంకట కృష్ణారెడ్డి (బీవీ కృష్ణారెడ్డి) పుట్టిన రోజు సందర్భంగా బధిరుల పాఠశాలలోని విద్యార్థులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం క్లబ్ సభ్యులు కేక్‌ను కట్ చేసి, బీవీని సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, సెక్రటరీ చుండూరి మురళీ సుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, డాక్టర్ దేవపాలన, సందిరెడ్డి శ్రీనివాసరావు, రామకోటేశ్వరరావు, వై. రమేష్‌బాబు, సురేంద్రబాబు, సుబ్బారావు, లేవి ప్రసాద్, ప్రిన్సిపాల్ సురేంద్ర, నిర్వాహకులు ఆరోగ్యం, భువనేశ్వరి, అంజాద్ బాషా పాల్గొన్నారు.

అపార్ కార్డుల జారీకి ప్రత్యేక కేంద్రం


ప్రత్యేక కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో స్వరూపారాణి

పంగులూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల విద్యార్థులకు అపార్ కార్డుల జారీ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రాన్ని ప్రతి విద్యార్థులు వినియోగించుకోవాలని ఎంపీడీవో స్వరూపారాణి కోరారు. మండలంలోని చందలూరు ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్‌ను ఎంపీ డీవో పరిశీలించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ కేంద్రాన్ని విద్యార్థుల సౌకర్యం కోసం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ సుమంత్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇనుప మంచానికి విద్యుత్ సరఫరా

ప్రైవేటు బస్ డ్రైవర్ మృతి

చీరాలటౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పడుకున్న ఇనుప మంచానికి విద్యుత్ సరఫరా కావడంతో ప్రైవేటు బస్ డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటన మంగళవారం రాత్రి చీరాల మండల పరిధిలోని కీర్తివారి పాలెంలో చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మసనం గోవిందు (40), రమణ దంపతులు. వీరికి 19, 18 వయస్సున్న ఇద్దరు కుమారులున్నారు. ఇతను వ్యవసాయం చేసుకుంటూ, ప్రైవేటు స్కూల్ బస్‌కు డ్రైవర్‌గా ఉన్నాడు. ఇంటి ఆవరణలో టేబుల్ ఫ్యాన్ మంచం వద్ద పెట్టుకుని పడుకున్నాడు. ఫ్యాను వైరు మంచం కాళ్ల కిందపడింది. ఇనుప మంచం కావడంతో విద్యుత్ సరఫరా అయి కుప్పకూలాడు. దీంతో కుటుంబ సభ్యులు చీరాల ఏరియా వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులు హాస్పిటల్ వద్దకు చేరుకుని రోదించారు.

కమిషనర్‌గారూ ఈ పొగ మాటేంటి

- కాగితాల్లో పరిశుభ్రం.. క్షేత్రస్థాయిలో కంపు
- ఏర్పాటు లక్ష్యం ఘనం.. నిర్వహణ లోపభూయిష్టం
- రూ.5 కోట్లు బూడిదలో పోసిన పన్నీరులా నిర్వహణ

చీరాల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఈ ఫొటోల్లో ఉన్నది రామాపురం సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో పరిస్థితులు. అయితే ఇక్కడ చెత్తను తగులబెట్టడం లేదని అధికారులు చెప్పడం అందరినీ విస్మయం కలిగిస్తోంది. గుంటూరు తరలిస్తున్నామని చెప్తున్నారు. అయితే ఆ ప్రక్రియ ఎప్పుడో ఆపేశారు. దీనిపై ఏలికలు ఏం చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.


తగులబెట్టిన చెత్త నుంచి వస్తున్న పొగ


మూలనపడ్డ కొబ్బరి బొండాల ప్రాసెసింగ్ మిషన్

సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్‌ను వేటపాలెం మండలం రామాపురంలో సుమారు రూ.5 కోట్ల వ్యయంతో నిర్మించారు. 2007లో పనులు ప్రారంభించి 2010లో ప్రారంభించారు. చీరాల మున్సిపల్ పరిధిలో వచ్చే చెత్తను అక్కడకు తరలిస్తారు. తడి, పొడిచెత్త వేరు చేస్తారు. చెత్త నుంచి సంపదను సృష్టించాలి. ఇదీ లక్ష్యం. అందుకు సంబంధించి స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ప్రతినిధుల బృందం ఆ యూనిట్‌కు వచ్చింది. దీన్ని రాష్ట్రంలోనే మోడల్‌గా ఉండే విధంగా చర్యలు చేపడతామని అప్పటి నేతలు చెప్పారు. అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టారు. ఆ ప్రాంతంలో కూరగాయలు, ఆకుకూరలను కూడా పండించారు. వర్మీ కంపోస్టుగా కొంత ఆదాయం కూడా తీశారు. తరువాత ప్రభుత్వాలు మారాయి, పాలకులు మారారు. ఈ క్రమంలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ కాస్త ప్రస్తుతం డంపింగ్ యార్డుగా తయారయింది. అక్కడ ఉన్న వివిధ రకాల యంత్రాలు మూలనపడ్డాయి.

కాగితాల్లో పరిశుభ్రం ... క్షేత్రస్థాయిలో మాత్రం కంపుగా ఆ డంపింగ్ యార్డు మారింది. అందులో చెత్తను తగులబెట్టి కాలుష్యాన్ని పెంచి పోషిస్తున్నారు. అయితే అక్కడ చెత్తను తగులబెట్టడం లేదని మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్ చెప్పడం ఆశ్చర్యం కలిగిస్తోంది. కొత్తగా వచ్చిన ఆయన క్షేత్ర స్థాయి పరిశీలన చేస్తే వాస్తవాలు తెలుసుకోవచ్చు. పాలకులు, అధికారులు కలసి పరిశీలన చేస్తే అనేక వాస్తవాలు వెలుగులోకి వస్తాయి. అందుకు అనుగుణంగా భవిష్యత్ కార్యాచరణ, యూనిట్ ఏర్పాటు లక్ష్యసాధనకు చర్యలు చేపట్టవచ్చు. అందుకు అనుగుణంగా పాలకులు, అధికారులు తగిన చర్యలు తీసుకుంటారని ఆశిద్దాం.


మూలనపడ్డ సర్టికల్ వేస్ట్ యంత్రపరికరాలు

అద్దంకి నుంచి దూరమైన ఉపాధి కార్యాలయం

- క్లస్టర్‌ను రద్దు చేసిన వైసీపీ ప్రభుత్వం
- ఆ నిధులతో గ్రామాలలో సీసీ రోడ్లు, డ్రెయిన్‌లు
- జిల్లాలో 2 చోట్ల మాత్రమే ఏపీడీ కార్యాలయాలు
- చీరాల క్లస్టర్‌కు ఇన్‌చార్జి అధికారే దిక్కు
- ఇక పర్యవేక్షణ ఎలా

అద్దంకి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకం నిధులతో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున సీసీ రోడ్లు, సైడ్ డ్రెన్‌ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. అదే సమయంలో రెగ్యులర్‌గా జరిగే ఉపాధి హామీ పథకం పనులు కూడా ఉన్నాయి. అయితే పర్యవేక్షణకు అధికారులు మాత్రం అంతంతమాత్రంగానే ఉన్నారు. బాపట్ల జిల్లా ఏర్పడిన తరువాత జిల్లాలో బాపట్లతో పాటు చీరాల, అద్దంకి క్లస్టర్‌లు ఉన్నాయి. అయితే గత రెండున్నర సంవత్సరాల క్రితం వైసీపీ ప్రభుత్వం అద్దంకిలో ఉన్న క్లస్టర్‌ను రద్దు చేసి మార్టూరు కేంద్రంగా ఉన్న చీరాల క్లస్టర్‌లో కలిపారు. దీంతో బాపట్ల జిల్లాలో రెండు క్లస్టర్‌లు మాత్రమే ఉన్నాయి. చీరాల క్లస్టర్ పరిధిలో అద్దంకి, పర్చూరు, చీరాల నియోజకవర్గాల పరిధిలోని 13 మండలాలు ఉన్నాయి. అద్దంకి, పర్చూరు నియోజకవర్గాల పరిధిలోని మండలాలలో కూలీల లభ్యత ఎక్కువగా ఉండడంతో ఉపాధి పనులు ఎక్కువగా జరుగుతున్నాయి. అదే సమయంలో జిల్లా వ్యాప్తంగా సుమారు 80 కోట్ల రూపాయల ఉపాధిహామీ పథకం నిధులతో సీసీ రోడ్లు, సైడ్ డ్రెన్‌లు మంజూరు అయ్యాయి. ఆ పనులన్నీ ఉపాధి హామీ అధికారులు పర్యవేక్షణ చేయాల్సి ఉంది. అయితే చీరాల క్లస్టర్‌కు రెగ్యులర్ ఏపీడీ కూడా లేరు. దీంతో ఏపీవోను ఇన్‌చార్జి ఏపీడీగా నియమించారు. వైసీపీ ప్రభుత్వంలో రద్దు చేసిన అద్దంకి క్లస్టర్‌ను తిరిగి పునరుద్ధరించడం ద్వారా అద్దంకి నియోజకవర్గం పరిధిలో జరిగే పనుల పర్యవేక్షణ సులువుగా మారే అవకాశం ఉంది. చీరాల, పర్చూరు నియోజకవర్గాల మండలాలు ఒక క్లస్టర్‌గా, అద్దంకి నియోజకవర్గంలోని మండలాలను ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేయాలని, అదే సమయంలో రెగ్యులర్ ఏపీడీని నియమించాలని పలువురు కోరుతున్నారు. ఉన్నతాధికారులు, మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పందించి అద్దంకిలో క్లస్టర్ ఏర్పాటుపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

ముఖాముఖి

నేర పరిశోధనలో అందరూ సమానమే

డీఎస్పీ మహ్మద్ మొయిన్



నేర పరిశోధనలో అందరూ సమానమే. చట్టపరిరక్షణలో భాగంగా నిబంధనలు అతిక్రమిస్తే ఎవరికైనా చర్యలు తప్పవు. చీరాల సబ్‌డివిజన్‌లో గతంలో పలు ప్రాంతాల్లో పనిచేసిన అనుభవం ఉంది. డీఎస్పీగా చీరాల తొలి పోస్టింగ్. తోటి అధికారులు, సిబ్బంది, ప్రజల సహకారంతో విధి నిర్వహణ పారదర్శకంగా కొనసాగిస్తానని ఆంధ్రజ్యోతి ప్రతినిధి అడిగిన ప్రశ్నలకు డీఎస్పీ మహ్మద్ మొయిన్ నమ్మకంగా బదులిచ్చారు.

- చీరాల సబ్ డివిజన్‌లో గతంలో మీరు పనిచేశారా?

డీఎస్పీ : ఇంకొల్లు, మార్టూరులో ఎస్ఐగా పనిచేశాను. అద్దంకి, పర్చూరు, చినగంజాం స్టేషన్లలకు ఇన్‌చార్జి ఎస్ఐగా పనిచేశాను. చీరాల సబ్ డివిజన్‌పై మంచి అవగాహనే ఉంది.

- డీఎస్పీగా ఇది తొలి పోస్టింగ్ కదా.. దీనికి ముందు ఎక్కడ పనిచేశారు?

డీఎస్పీ : ఇక్కడకు ముందు దర్శి, ఒంగోలు క్రైం, పోలీస్ ట్రైనింగ్ కాలేజీలో సీఐగా విధులు నిర్వహించాను. డీఎస్పీగా ప్రమోషన్‌తో ఇక్కడకు వచ్చాను. డీఎస్పీగా ఇదే తొలి పోస్టింగ్.

- చీరాల ప్రాంతం సున్నితం, సమస్యాత్మకం అని రెండు కోణాల్లో చెప్పుకుంటారు. మీరెలా అధిగమిస్తారు?

డీఎస్పీ : సమస్యలు ఎక్కడైనా ఉంటాయి. అవి మనం చూసే కోణాన్ని బట్టి మారతాయి. తోటి అధికారులు, సిబ్బంది, ప్రజల సహకారంతో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా, నేరప్రవృత్తి పెరగకుండా, నేరాలు నియంత్రించేందుకు పారదర్శకంగా అడుగులు వేస్తాం. మెరుగైన సేవలు అందించడమే అన్ని సమస్యలకు పరిష్కారం.

- వేటపాలెం మండలం పాపాయిపాలెంకు చెందిన పులి శ్రీనివాసరావు అనుమానాస్పద మృతి కొంత రాజకీయ రంగు పులుముకుంది. ఆ కేసుకు సంబంధించి చార్జి షీట్ ఫైల్ చేశారా?

డీఎస్పీ : ఆ కేసుకు సంబంధించి వివరాలు తెలుసుకుంటున్నాను. పోస్టుమార్టం, ఫోరెన్సిక్ తదితర రిపోర్టులు రావాల్సి ఉంది. అవి వచ్చాక చార్జిషీట్ ఫైల్ చేస్తాం. కేసును అన్ని కోణాల్లో పరిశీలిస్తాం. సత్వర చర్యలు చేపడతాం. వాస్తవాలు వెల్లడిస్తాం.

- తీరప్రాంతంలో కొన్ని చోట్ల పర్యాటకుల ముసుగులో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు ప్రచారం ఉంది. దీనిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

డీఎస్పీ : అసాంఘిక కార్యకలాపాలు ఎక్కడ జరిగినా కఠినంగా వ్యవహరిస్తాం. రిసార్ట్స్, హోటల్స్ తదితరాలకు వచ్చే పర్యాటకులు భార్య, భర్త, కుటుంబ సభ్యులు అందుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు ఉన్నవారికే రూములు ఇవ్వాలని కచ్చితంగా చెప్తాం. పరిసరాల్లో కూడా సీసీ కెమెరాల ఏర్పాటుపై సూచనలు చేస్తాం.

- ప్రజలకు మీరిచ్చే సూచన, నేరస్తులకు మీరు చేసే హెచ్చరిక?

డీఎస్పీ : నేర నియంత్రణలో ప్రజల సహకారం కీలకం. ప్రజలు కూడా యూనిఫాం లేని పోలీసులే. నేరస్తుల కదలికలను పోలీస్‌లకు తెలిపేందుకు ముందుకు రావాలి. వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం. నేరాలకు పాల్పడే వారు ఎవరైనా ఉపేక్షించం.

రయ్‌రయ్

(5వ పేజీ తరువాయి)

పురుషోత్తమపట్నం, చిలకలూరిపేట, గణపవరం, నాదెండ్ల వద్ద అండర్ పాస్‌ల నిర్మాణం చేశారు. బొప్పూడి, కోటప్పకొండ, గణపవరం, నాదెండ్ల ప్రాంతాల్లో 8 బస్ షెల్టర్లు నిర్మించారు. రోడ్డుకు ఒకవైపున ప్రధాన సర్వీస్ రోడ్డు ఉంటుంది. అండర్ పాస్‌ల వద్ద రెండు వైపులా సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేశారు. కాంట్రాక్టర్లు 15 సంవత్సరాల పాటు ఈ రోడ్డు నిర్వహణ పనులు చేయాల్సి ఉంటుంది. బైపాస్ రోడ్డుకు రెండు వైపులా 16 కిలోమీటర్ల పొడవునా శాశ్వత గోడ నిర్మాణం చేశారు. పశువులు రోడ్డుపైకి రాకుండా ఉండడానికి, ఆక్రమణలను అరికట్టడానికి, ప్రమాదాల నివారణకు ఈ గోడను నిర్మించారు. రోడ్డు పక్కన గణపవరం వద్ద హైవేస్‌కు చెందిన విశాలమైన ప్రదేశం రెండు చోట్ల ఉంది. దీంతో దానిని సద్వినియోగం చేసుకునేందుకు ఒక మెగా వాట్ సోలార్ ప్లాంటును ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం అక్కడ సోలార్ ప్లేట్లను బిగిస్తున్నారు. దీని ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను పగటి వేళలో గ్రిడ్‌కు అనుసంధానం చేసి, రాత్రిళ్లు రోడ్డుపై లైట్ల వెలుగులకు వినియోగించనున్నారు. బైపాస్ రోడ్డు పొడవునా ఒక వైపున 3,500 మొక్కలను నాటుతున్నారు. వాటిలో గానుగ, వేప, నల్లమద్ది, గుల్మోరా, పెంట్ ఫామ్ జాతుల మొక్కలు ఉన్నాయి. ప్రతి మొక్కకు ట్రీ గార్డును ఏర్పాటు చేస్తున్నారు. వీటికి నిత్యం నీటిని అందించి సంరక్షించేందుకు రెండు చోట్ల బోరు పాయింట్లు ఏర్పాటు చేసి ట్యాంకర్ల ద్వారా నీటిని అందించే ఏర్పాటు చేశారు. రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్లపై కాగితం పూల మొక్కలను నాటారు.


రోడ్డుకు ఇరువైపులా నిర్మించిన గోడ

నాణ్యతా ప్రమాణాల తనిఖీలు

రోడ్డు నిర్మాణం పనులు పూర్తయినట్లుగా బీఎస్‌సీపీఎల్ కంపెనీ కాంట్రాక్టర్లు నేషనల్ హైవే సంస్థకు నివేదించారు. దీంతో హైవేస్ అధికారులు పనుల నాణ్యతా ప్రమాణాల పరిశీలన చేస్తున్నారు. పరిశీలన అనంతరం రోడ్డు ప్రారంభోత్సవానికి పచ్చజెండా ఊపుతారు. ఇప్పటికే నేషనల్ హైవేస్ ప్రాజెక్టు డైరెక్టర్ పార్వతీశం ఆధ్వర్యంలో రోడ్డు తనిఖీ జరిగింది. బైపాస్ రోడ్డులో అత్యంత ఆధునాతనమైన ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఎక్కడికక్కడ కెమెరాల ఏర్పాటు జరిగింది. వాహనాల వేగంపై కన్నేసి ఉంచేందుకు ప్రత్యేక పరికరాలు బిగించారు. ఎప్పటికప్పుడు ఈ సమాచారం గుంటూరు విజయవాడ మధ్య ఉన్న కాజ టోల్గేట్ వద్దకు చేరే విధంగా ఏర్పాటు జరిగింది.

టోల్‌గేట్‌లేని మార్గంగా బైపాస్

చిలకలూరిపేట వద్ద బైపాస్ రోడ్డు నిర్మాణం పూర్తయినా ఈ మార్గంలో టోల్‌గేట్ ఉండదని అధికారులు స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించిన వ్యయాన్ని రాబట్టుకోవడానికి గుంటూరు విజయవాడ మధ్య ఉన్న కాజ టోల్‌గేట్ వద్ద రేట్లను పెంచవచ్చని సమాచారం.

పేట ప్రజలకు తప్పిన తిప్పలు

బైపాస్ రోడ్డుపై అధికారికంగా రాకపోకలకు అనుమతిస్తే చిలకలూరిపేట ప్రజలకు ఊరట లభిస్తుంది. ప్రస్తుతం పట్టణం మధ్యగా వెళ్లే జాతీయ రహదారిపై మూడు ప్రధాన సెంటర్లలో నిత్యం ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతున్నది. దీనివల్ల ఒంగోలు గుంటూరు మధ్య ప్రయాణించేవారికి సుమారు 30 నిమిషాల సమయం వృథా అవుతున్నది. పట్టణ ప్రజలు రోడ్డు దాటి వెళ్లాలంటే కనీసం 20 నిమిషాలు పడుతున్నది. తరచూ ప్రమాదాలు జరిగి, ప్రాణాలు కోల్పోతున్నారు. బైపాస్ రోడ్డును ప్రారంభిస్తే అధిక శాతం వాహనాలు ఆ మార్గంలో వెళ్తాయి. ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు తొలగిపోతాయి. కాలుష్యం సమస్యకు కూడా తెరపడుతుంది.

చీఫ్ విప్‌గా జీవీ

(5వ పేజీ తరువాయి)

చీఫ్‌విప్ పదవితో పార్టీ అధిష్ఠానం జీవీకి సముచిత స్థానం కల్పించింది. 2009, 2014లో జీవీ వినుకొండ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2019లో ఓటమి చెందారు. 2024 ఎన్నికల్లో పోటీ చేసి మూడోసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. టీడీపీలో వివిధ హోదాల్లో ఆయన పని చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లా, పల్నాడు జిల్లాకు టీడీపీ అధ్యక్షుడిగా దాదాపు పదేళ్లు బాధ్యతలు నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడి హోదాలో టీడీపీ సభ్యత్వ నమోదులో జీవీ పల్నాడు జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిపి అధిష్ఠానం మన్ననలు పొందారు. ఇక ఆయన ఐదేళ్ల వైసీపీ అరాచకాలకు ఎదురొడ్డి అనేక పోరాటాలు చేశారు. వైసీపీ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో శావల్యాపురం జడ్పీటీసీని గెలిపించి ప్రతిపక్షంలో కూడా ఆయన సత్తా చాటారు. జీవీకి పదవి దక్కడంపై టీడీపీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, పలువురు నేతలు జీవీని సత్కరించి ఆయనకు అభినందనలు తెలిపారు.

సమర్థవంతంగా నిర్వహిస్తా : జీవీ

చీఫ్‌విప్‌గా బాధ్యతలు అప్పగించిన సీఎం నారా చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌లకు జీవీ కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానన్నారు. అధిష్ఠానం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని తెలిపారు. సహచర ఎమ్మెల్యేలకు పూర్తి స్థాయిలో సహాయ సహకారాలు అందిస్తానన్నారు. శాసన సభ విలువలు గౌరవం పెంచేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు.

వినుకొండకు రెండోసారి పదవి

వినుకొండ నియోజకవర్గానికి రెండో సారి చీఫ్‌విప్ పదవి దక్కింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు వినుకొండ నుంచి అప్పట్లో ఎమ్మెల్యేగా గెలిచిన నన్నపనేని రాజకుమారి చీఫ్‌విప్‌గా పని చేశారు. ఆ తర్వాత జీవీని ఆ పదవి వరించింది.

87 మందికి వైద్య పరీక్షలు

అద్దంకిటౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : వాతావరణ మార్పుల వలన వచ్చే సీజనల్ వ్యాధులపై ప్రజలు అవగాహన కలిగి ఉండి ముందస్తుగా తగు జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ మనోజ్, డాక్టర్ హరికృష్ణ తెలిపారు. మంగళవారం మండలంలోని బొమ్మనంపాడు గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వరం, ఇతర రుగ్మతలతో బాధపడుతున్న 87 మందిని పరీక్షించి మందులను అందజేశారు. గ్రామంలో ఆశాలు, ఏఎన్ఎంలు జ్వర పీడితుల సర్వే నిర్వహించిన నేపథ్యంలో రోగులను పరీక్షించి పలు సూచనలు చేసి, మందులను అందజేశారు. గ్రామంలో వాటర్ ప్లాంట్‌లను పరిశీలించి తాగునీటి నాణ్యతాప్రమాణాలను పరీక్షించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి, పారిశుధ్య కార్మికులతో కలిసి గ్రామంలో పారిశుధ్యం మెరుగునకు ప్రణాళికను రూపొందించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు మక్బూల్‌జాని, సర్వేపల్లి తబిత, కుమార్, ఏఎన్ఎంలు పుష్పలీల, ఎంఎల్‌హెచ్‌పీ షరీఫా, ఆశాలు అంజలి, నాగలక్ష్మి, అమేంద్ర 104 సిబ్బంది మణికంఠ, ఉదయ్ పాల్గొన్నారు.


రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ మనోజ్

జర్నలిస్టులపై అనుచిత వ్యాఖ్యలు హేయం

చీరాలటౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : చీరాల ఏరియా వైద్యశాల డ్యూటీ డాక్టర్ వ్యాఖ్యలు హేయమని పలువురు జర్నలిస్టులు అన్నారు. సోమవారం వార్త సేకరణలో ఉన్న జర్నలిస్టుల పట్ల ఆమె దురుసుగా ప్రవర్తించారు. దీంతో మంగళవారం ఉదయం చీరాల జర్నలిస్టులు హాస్పిటల్ వద్ద ఆందోళనకు దిగారు. అనంతరం హాస్పిటల్ సూపరింటెండెంట్‌కు డా.సుభాషిణికి వినతిపత్రం అందజేశారు. ఇకపై ఇలాంటివి పునరావృతం కాకుండా చూస్తామని ఆమె హామీ ఇచ్చారు.

పడిపోయిన పాత విద్యుత్ స్తంభం

తప్పిన ప్రమాదం

మార్టూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జొన్నతాళి గ్రామంలో మంగళవారం ఉదయం శిథిలమైన విద్యుత్ స్తంభం రోడ్డుపై విరిగి పడిన ఘటన స్థానికులను భయాందోళనకు గురి చేసింది. వాస్తవంగా శిథిల స్తంభం పడిపోయిన సమీపంలో రోడ్డు పక్కన అరుగులపై రోజు జనం పిచ్చాపాటి కబుర్లు చెప్పుకుంటుంటారు. అంతే కాకుండా రోడ్డుపైన అడపాదడపా తిరుగుతూనే ఉంటారు. అయితే ఉదయం కరెంట్ స్తంభం విరిగి పడిన సమయంలో అరుగులమీద కానీ, రోడ్డుమీద కానీ జనం ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. వెంటనే గ్రామానికి చెందిన శానంపూడి చైతన్య అనే యువకుడు ఈ విషయాన్ని మార్టూరు విద్యుత్ శాఖ ఏడీఏ సురేంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లాడు. గతంలో కూడా సర్పంచ్ శానంపూడి నాగేంద్రమ్మ గ్రామంలోని శిథిలమైన విద్యుత్ స్తంభాలను తొలగించి వాటి స్థానంలో కొత్త స్తంభాలను ఏర్పాటు చేయాలని పలు సార్లు విద్యుత్ అధికారులను కోరారు. ఇదిలావుండగా సాయంత్రానికి విద్యుత్ అధికారులు స్పందించి గ్రామస్థుల సహకారంతో పడిపోయిన విద్యుత్ స్తంభాన్ని తొలగించి కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేసి విద్యుత్‌ను పునరుద్ధరించడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.


రోడ్డుపై అడ్డంగా విరిగి పడిన విద్యుత్ స్తంభం

సకాలంలో వైద్యం చేద్దాం.. ప్రాణాలను కాపాడుదాం

- లక్ష్యంతో ముందుకు సాగుతున్న సిబ్బంది
- ఏరియా ఆసుపత్రికి పెరిగిన ఓపీలు
- వెంటాడుతున్న వైద్యులు, సిబ్బంది కొరత
- అందుబాటులో గుండెపోటుకు అత్యవసర ఇంజక్షన్
- కుక్కకాటుకు ప్రత్యేక మందులు
- రాజకీయ నాయకుల పరామర్శలతో కొంత ఇబ్బంది
- పని ఒత్తిడితో సతమతమవుతున్న వైద్యులు, సిబ్బంది
- ఆసుపత్రి అభివృద్ధి కమిటీ దృష్టి సారించాల్సిన అవసరం


చీరాల ఏరియా వైద్యశాల

చీరాల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో బాధపడే నిరుపేద, మధ్యతరగతి వారికి ఆరోగ్య ప్రదాయినులు ప్రభుత్వ వైద్యశాలలు. అందులో పనిచేసే వైద్యులు కనిపించే దేవుళ్లు. చీరాల ఏరియా వైద్యశాల కార్పొరేట్ హంగులతో సువిశాలంగా ఉంటుంది. రోజుకు సుమారు 500 ఓపీలు వస్తుంటారు. రోడ్డు ప్రమాదాలు, కొట్లాట కేసులు కూడా అనునిత్యం ఉంటూనే ఉంటాయి. ప్రమాదకరస్థితిలో వచ్చినవారికి సకాలంలో వైద్యం అందించి, వారి ప్రాణాలను కాపాడాలనే లక్ష్యంతో వైద్యులు, సిబ్బంది ఉరుకులు, పరుగులు తీస్తుంటారు. ఈక్రమంలో వారిని పరామర్శించేందుకు వచ్చే రాజకీయనాయకులు, బంధువులు, మీడియా కవరేజీ తదితర అంశాలతో కొన్ని సందర్భాల్లో వైద్యులు, సిబ్బంది ఒత్తిడికి గురవుతుంటారు. ఆ క్రమంలో ముందుగా వైద్యులు ప్రమాదంలో ఉన్నవారికి వైద్యం అందించేందుకు మిగిలినవారు సహకరించాల్సిన అవసరం ఎంతైనా ఉంటుంది. అది స్వీయనియంత్రణతోనే సాధ్యం. ఇదిలావుంటే ఏరియా వైద్యశాలలో వైద్యులు, సిబ్బంది కొరత వెంటాడుతోంది. ఈ నేపథ్యంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఏరియా వైద్యశాలపై ప్రత్యేక దృష్టి సారించి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అందుబాటులో అరుదైన ఇంజక్షన్‌లు

ఏరియా వైద్యశాలలో గుండెపోటుతో వచ్చిన వారికి అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించే ఇంజక్షన్ (రూ.20వేలు విలువచేసే)లు అందుబాటులో ఉన్నాయి. గత ఏడాది కాలంలో గుండెపోటుతో ప్రాణాపాయ స్థితిలో వచ్చిన 12 మందికి ఆ ఇంజక్షన్‌లను ఇచ్చారు. ఇంకా 7 ఇంజక్షన్లు అందుబాటుల ఉన్నాయి. కుక్కకాటుకు సంబంధించి రూ.3వేల విలువ చేసే ఇంజక్షన్‌లు, పాముకాటుకు అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయి.

ఖరీదైన సీటీ స్కాన్, డయాలసిస్

ఏరియా వైద్యశాలలో ఖరీదైన సీటీ స్కాన్ అందుబాటులో ఉంది. ఇదే స్కాన్ ప్రైవేటుగా చేయించాలంటే ఒక్కో పేషెంట్‌కు రూ.2వేల వరకు ఖర్చవుతుంది. డయాలసిస్ కూడా అందుబాటులో ఉంది. డయాలసిస్ అవసరమైన పేషెంట్లు విడిగా ఆ వైద్యం పొందాలంటే పెద్ద మొత్తంలోనే అవుతుంది. ఆ సేవలను ఇక్కడ ఉచితంగా అందిస్తున్నారు. అయితే డెంటల్ ఎక్స్‌రే మాత్రం అందుబాటులో లేదు.

వెంటాడుతున్న వైద్యులు, సిబ్బంది కొరత

ఏరియా వైద్యశాలలో రోగులను వైద్యులు, సిబ్బంది కొరత వెంటాడుతోంది. అన్నీ ఉన్నా అల్లుడినోట్లో శని అన్నట్లుగా కొన్ని సందర్భాల్లో మెరుగైన వైద్య సేవలు అందించలేక, ఇతర ప్రాంతాలకు రిఫర్ చేస్తున్నారు. వివిధ విభాగాల్లో ఐదుగురు వైద్యుల అవసరం ఉంది. డిప్యుటేషన్ మీద తెనాలికి ఒకరు, ఒంగోలు రిమ్స్‌కు మరొకరిని పంపించారు. ఆర్‌ఎంఈవో పోస్టు ఖాళీగా ఉంది. పెరిగిన రోగుల సంఖ్యకు అనుగుణంగా నర్సుల సంఖ్య పూర్తిస్థాయిలో లేదు. ఖాళీలు భర్తీ చేయాల్సిన అవసరం ఉంది.

కొన్ని సందర్భాల్లో హడావుడితో ఒత్తిడికి గురవుతున్న వైద్యులు

నిత్యం రోడ్డు ప్రమాదాలు, కొట్లాట కేసుల ఏరియా వైద్యశాలకు వస్తూనే ఉంటాయి. కొన్ని సందర్భాల్లో ఆయా క్షతగాత్రులను పరామర్శించేందుకు రాజకీయనాయకులు, మీడియా కవరేజీ, బంధువులు గణనీయంగా ఉండటంతో వైద్యసేవలు అందించేందుకు వైద్యులు, సిబ్బంది ఒకింత ఒత్తిడికి గురవుతున్నారు. ఆయా సందర్భాల్లో ముందుగా వైద్యసేవలు అందించేవిధంగా ఆయా వర్గాలు సహకరించాల్సిన అవసరం ఉందని పలువురు భావిస్తున్నారు.

అవుట్ పోస్టు పోలీసులు లేకుంటే నైట్ డ్యూటీ కష్టమే

ఆసుపత్రిలో పనిచేసే సిబ్బందిలో ఓ వ్యక్తి రాత్రిళ్లు మద్యం సేవించి విధులకు హాజరువుతున్నారు. అతను మరికొందరిని గుంపు చేస్తున్నాడు. ఈ క్రమంలో అవుట్ పోస్టు పోలీసులు లేకుంటే నైట్ డ్యూటీ చేయడం కష్టమని ఆసుపత్రిలో పనిచేసే కొందరు తమ నిస్సహాయతను వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఆసుపత్రి అభివృద్ధి కమిటీ దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. లేదంటే ఆసుపత్రికి అప్రద వచ్చే అవకాశం ఉంది.

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలన్నదే లక్ష్యం



రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలన్నదే మా లక్ష్యం. అందుకు అనుగుణంగా పనిచేస్తున్నాం. రోజుకు సుమారు 500 నుంచి 700వరకు ఓపీలు వస్తున్నాయి. మందులు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయి. వైద్యులు, సిబ్బంది కొరత ఉంది. ప్రతి రోజు ప్రమాద కేసులు వస్తూనే ఉంటాయి. కొన్ని సందర్భాల్లో ప్రాణాపాయస్థితిలో వచ్చే వారికి మెరుగైన వైద్యసేవలు అందించే క్రమంలోనే వైద్యుల ఆలోచనలు ఉంటాయి. మిగిలిన విషయాలు పట్టించుకోరు. దాన్ని అర్థం చేసుకుని సహకరించాలి. అప్పుడే సత్ఫలితాలు వస్తాయి. సిబ్బందిలో ఒకతను మద్యం సేవించి డ్యూటీకి వస్తున్నారు. తప్పు చేసిన వారిపై చర్యల కోసం ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తాను. ఈ క్రమంలో అవుట్ పోస్టు పోలీసులు అందించే రక్షణ ఎనలేనిది. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం ఇటీవల జరిగింది. మెరుగైన చర్యలకు కార్యాచరణ జరుగుతోంది. అందరూ సహకరించాలని కోరుతున్నాం.

- డాక్టర్ సుభాషిణి, ఇన్‌చార్జి సూపరింటెండెంట్, ఏరియా వైద్యశాల, చీరాల

సాగునీటి వనరుల అభివృద్ధికి చేయూతనివ్వాలి

మంత్రికి ఎమ్మెల్యే కొండయ్య విజ్ఞప్తి


మంత్రి నిమ్మలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : చీరాల నియోజకవర్గ పరిధిలో ఉన్న సాగునీటి వనరుల అభివృద్ధికి చేయూతను ఇవ్వాలని నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య విజ్ఞప్తి చేశారు. మంగళవారం మంత్రి చాంబర్‌లో ఆయనను ఎమ్మెల్యే కొండయ్య కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలో ఉన్న కొమ్మమూరు కాలువ, ఎత్తిపోతల పథకాలు, వాటి పనితీరు, వాటి అభివృద్ధికి అందించాల్సిన చేయూత తదితర అంశాలను ఎమ్మెల్యే కొండయ్య మంత్రికి వివరించారు. రైతుల ప్రయోజనాలతో పాటు తాగునీటి సమస్య పరిష్కారానికి ఉన్న అనుకూల పరిస్థితులను ఎమ్మెల్యే ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై మంత్రి నిమ్మల సానుకూలంగా స్పందించారు.

విద్యుత్ సోలార్‌తో ప్రజలకు ప్రయోజనం


మాట్లాడుతున్న విద్యుత్ శాఖ ఎస్ఈ ఆంజనేయులు

ఎస్ఈ ఆంజనేయులు

చీరాలటౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సోలార్ వినియోగంతో ప్రజలకు బిల్లు భారంతో పాటు పలు ప్రయోజనాలు ఉన్నాయని జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ జి.ఆంజనేయులు అన్నారు. ముంతావారి సెంటర్‌లో గల ఆర్యవైశ్య కల్యాణ మండపంలో పీఎం సూర్యఘర్ యోజన పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈఈ జాన్ థామస్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించగా సబ్ డివిజన్ పరిధిలోని విద్యుత్‌శాఖ అధికారులు, సోలార్ వెండర్స్, వినియోగదారులు పాల్గొన్నారు. అంతకుముందు పట్టణంలో 34 బృందాలుగా ఏర్పడి విజిలెన్స్ విభాగం ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. మొత్తం 2803 మీటర్లు తనిఖీలు చేసి 159 కేసులు నమోదు చేశారు. ఈక్రమంలోనే రూ.7.75 లక్షలు అపరాధ రుసుం విధించారు. కార్యక్రమంలో డీఈఈలు హరిప్రసాదరావు, రమేష్ బాబు, ఏఈలు పాల్గొన్నారు.

ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించాలి

ఆర్డీవో గ్లోరియా


నూతలపాడులో ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న ఆర్డీవో గ్లోరియా

పర్చూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : అన్యాక్రాంతం కాకుండా ఖాళీగా ఉన్న ప్రభుత్వం భూములను గుర్తించాలని బాపట్ల ఆర్డీవో పి.గ్లోరియా రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ల్యాండ్ బ్యాంక్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం పర్చూరు తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ఈవిషయంపై అధికారులకు తగు సలహాలు సూచనలు ఇచ్చారు. అనంతరం మండలంలోని నూతలపాడు గ్రామంలోని ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములను పరిశీలించారు. వాటి రికార్డులను తనిఖీ చేశారు. భూమి విస్తీర్ణం తదితర అంశాలను సర్వేయర్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.బ్రహ్మయ్య, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రేమ్ కుమార్, వీఆర్వో శిరీష, సర్వేయర్ బాలాంజనేయులు పాల్గొన్నారు.

యద్దనపూడిలో..

యద్దనపూడి : యద్దనపూడి మండలంలోని ప్రభుత్వ భూములను మంగళవారం ఆర్డీవో గ్లోరియా పరిశీలించారు. తహసీల్దార్ కే రవికుమార్ మండలంలోని యనమదల, పూనూరు, అనంతవరం, జాగర్లమూడి తదితర గ్రామాలలోని ప్రభుత్వ భూములను ఆర్డీవోకు చూపించారు. వాటిలో యనమదల గ్రామంలోని 16.40 ఎకరాల ప్రభుత్వ భూమిని, మిగిలిన గ్రామాలలోని కొన్ని ప్రభుత్వ భూములను గుర్తించారు. మండలంలో 40ఎకరాలు ప్రభుత్వ భూమి ఉన్నట్లుగా అధికారులు తెలిపారు. ఇదిలావుండగా గన్నవరం గ్రామంలో ఒక రైతు తనకు చెందిన 99 సెంట్ల పొలాన్ని ప్రభుత్వానికి మార్కెట్ ధరకు ఇవ్వడానికి అంగీకరించడంతో ఆ పొలాన్ని ఆర్డీవో పరిశీలించారు. అనంతరం మార్టూరు మండలంలో తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీవో అధికారులతో సమావేశమై ప్రభుత్వ భూముల వివరాలను తెలుసుకున్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

సంతమాగులూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గురిజేపల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చిందని డాక్టర్ నిర్మల్ కుమార్ తెలిపారు. ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను అందజేసినట్లు తెలిపారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు

- చిన్న అపశ్రుతి కూడా జరగకూడదు
- సముద్ర స్నానాలకు పక్కా ఏర్పాట్లు చేయాలి
- ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు


ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

చీరాల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులకు మెరుగైన సౌకర్యాలను కల్పించాలని, ఎక్కడ కూడా చిన్న అపశ్రుతి కూడా జరగకూడదని ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు రెవెన్యూ, పోలీస్, పంచాయతీ అధికారులకు చెప్పారు. ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం వివిధ శాఖల అధికారులతో కార్తీక పౌర్ణమి సందర్భంగా సముద్ర స్నానాలకు వచ్చే భక్తులకు అవసరమైన ఏర్పాట్లు, ముందు జాగ్రత్త చర్యలపై ఆర్డీవో సమీక్షించారు. ప్రాథమికంగా పారిశుధ్యం, తాత్కాలిక మరుగుదొడ్లు, స్నానాల గదులు, సముద్రంలో లోతు తెలిపే హెచ్చరిక జెండాలు, గజ ఈతగాళ్ల ఏర్పాటు, ప్రాథమిక చికిత్స, విద్యుత్ దీపాలు తదితర అంశాలపై చర్చించారు. జరుగుతున్న ఏర్పాట్ల పురోగతిని అడిగి తెలుసుకున్న ఆర్డీవో పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ, పోలీస్, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

సాగులో సాంకేతిక పద్ధతులు పాటించాలి

ఏడీ శ్రీనివాసరావు


అలవలపాడులో మొక్కజొన్నను పరిశీలిస్తున్న ఏడీ శ్రీనివాసరావు, ఏవో సుబ్బారెడ్డి

పంగులూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రైతులు పంట సాగులో సాంకేతిక పద్ధతులు పాటించాలని తక్కువ ఖర్చుతో అధిక ఫలసాయం పొందవచ్చని వ్యవసాయ సహాయ సంచాలకులు శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని జార్లమూడివారిపాలెం, అలవలపాడు గ్రామాలలో మంగళవారం జరిగిన పొలంపిలుస్తోంది. కార్యక్రమంలో పాల్గొని మినుము, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. అనంతరం గ్రామసభలో మాట్లాడారు. సమగ్ర ఎరువుల యాజమాన్య పద్ధతులను పాటించాలన్నారు. భాస్వరం ఎరువు ఆఖరి దుక్కిలోనే వేయాలని తెలిపారు. వ్యవసాయాధికారుల సూచనలను అనుసరించి రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులు, ప్రకృతిలో లభించే ఆకులు, అలములతో తయారు చేసుకునే జీవామృతం వంటి కషాయాలు పైరుపై పిచికారీ చేసి తెగుళ్లు, పురుగు నివారించుకోవాలని సూచించారు. రబీలో సాగు చేసిన పంటలకు మీ సేవా కేంద్రంలో లేదా సచివాలయాలలో పంటల బీమా చేయించాలని ఏవో సుబ్బారెడ్డి సూచించారు. కార్యక్రమంలో రైతు సేవాకేంద్రం సిబ్బంది ఫిలిప్, దిల్లీ, ఏఈవో ప్రభాకరరావు, రైతులు పాల్గొన్నారు.

పత్తిలో సస్య రక్షణ చర్యలు చేపట్టాలి

బల్లికురవ : పత్తి రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ ఏవో కుమారి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని నక్కబొక్కలపాడు, మల్లాయపాలెం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఏవో మాట్లాడుతూ రైతులు సేంద్రియ పద్ధతిలో కషాయాలను వాడుకోవాలన్నారు. అనుమతులు ఉన్న డీలర్ల వద్దనే విత్తనాలను కొనుగోలు చేయాలన్నారు. పీఎం పసల్ బీమాను చెల్లించాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ధూళిపాళ్ల బుల్లిరామయ్య పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు చేసుకోవాలి

సంతమాగులూరు : రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను ఈ-పంటలో నమోదు చేసుకోవాలని వ్యవసాయ అధికారి లావణ్య తెలిపారు. మండలంలోని మామిళ్లపల్లి గ్రామంలో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో సాగులో ఉన్న పంటలను వ్యవసాయశాఖ అధికారులు పరిశీలించి పలు సూచనలు చేశారు.

పర్చూరు : భూసార పరీక్షలు నిర్వహించుకొని సాగుచేసుకుంటే మంచి ఫలితాలు వస్తాయని వ్యవసాయాధికారి రామ్మోహన్ రెడ్డి అన్నారు. పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని నూతలపాడు గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో రైతులకు సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి వై.శ్రీకాంత్, రైతు సేవా సిబ్బంది మధుమోహన్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


ఈపురుపాలెం ప్రధాన రహదారిలో నిలిచిన నీరు

చినుకు పడితే చెరువే

చీరాల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఈపురుపాలెంలో కొద్దిపాటి వర్షం పడినా ప్రధాన రహదారిలో పలుచోట్ల చెరువులను తలపిస్తూ రోడ్డుపై వర్షపు నీరు నిలుస్తోంది. వర్షం ఆగాక కూడా ఆ నీరు అలానే నిల్వ ఉంటోంది. డ్రైనేజీ సౌకర్యం లేకపోవడమే అందుకు కారణం. దీంతో వర్షం ఆగిన తరువాత వాహనాలు వేగంగా రాకపోకలు సాగించే సమయంలో ఆ వర్షపునీరు తమపై పడుతోందని పాదచారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షపు నీరు నిల్వ లేకుండా కుండా తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

చేతులు శుభ్రతతో వ్యాధులు దూరం

మేదరమెట్ల, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : చేతులు పరిశుభ్రతతో వ్యాధులకు దూరంగా ఉండవచ్చని డాక్టర్ అక్షిత, డాక్టర్ రాజశేఖర్ అన్నారు. మంగళవారం కొరిశపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాలను వరు సందర్శించారు. ఈ సందర్భంగా ఆహారం తీసుకునే ముందు చేతులను శుభ్రంగా కడుక్కోవాలని విద్యార్థులకు తెలిపారు. చేతులు ఎలా కడుగుకోవాలో చూపించారు. కార్యక్రమంలో వైద్యశాల సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యల సత్వర పరిష్కారానికి కృషి

ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

మేదరమెట్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పరిష్కార వేదిక ద్వారా వివిధ సమస్యలపై వచ్చిన అర్జీలను సత్వర పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని చీరాల ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు అన్నారు. మంగళవారం కొరిశపాడు మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక గ్రీ వెన్స్ డే కార్యక్రమంలో ఆర్డీవో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ సమస్యల ఏడు అర్జీలు అందినట్లు చెప్పారు. ఎక్కువగా భూ సంబంధిత వాటివేనన్నారు. తిమ్మనపాలెం సమీపంలో జాతీయ రహదారిపై నిర్మిస్తున్న అండర్ పాస్‌లో ఇల్లు కోల్పోయిన వారికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పారిశ్రామిక రంగం అభివృద్ధి కోసం గతంలో స్థలం కేటాయించి వాటిని వినియోగించకపోతే తిరిగి స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. మండలంలో అటువంటి స్థలాలను గుర్తించి నివేదిక అందించాలని, వీఆరోవకు సూచించారు. అక్రమ లే అ వుట్‌లను గుర్తించి వారికి నోటీసు అందించాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుబ్బారెడ్డి, ఎంపీడీవో రాజ్యలక్ష్మి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

యద్దనపూడి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పొగాకుకు బదులు ప్రత్యామ్నాయ పంటలుగా మొక్కజొన్న, శనగ, మినుము పంటలు వేసుకోవాలని వ్యవసాయ అధికారి ఎస్.మేరమ్మ రైతులకు సూచించారు.మంగళవారం మండలంలోని పోలూరు గ్రామంలో పొగాకు సాగుచేసే రైతులు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో ఎస్.మేరమ్మ రైతులతో మాట్లాడుతూ పొగాకు సాగు పెరగడం వలన పంటకు ధర తగ్గుతున్నదన్నారు. అంతేగాకుండా పొగాకు వినియోగంతో అనారోగ్య సమస్యలు వస్తున్నాయన్నారు. పంట మార్పిడి విధానం వలన అధిక దిగుబడులు వస్తాయన్నారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.


రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలి

ఎంపీడీవో స్వరూపారాణి

పంగులూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణంలో తగిన నాణ్యతా ప్రమాణాలను పాటించాలని ఎంపీడీవో స్వరూపారాణి సూచించారు. మండలంలోని చందలూరు, బూదవాడ గ్రామాలలో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం ఎంపీడీవో పరిశీలించారు. చందలూరులో రూ.30లక్షలతో 610 మీటర్ల నిడివిలో బీసీ కాలని, నూజెళ్లపల్లి వెళ్లే రహదారి వైపు, నూతన సచివాలయం ఎదురుగా మూడు సీసీ రోడ్లు నిర్మిస్తున్నట్లు అధికారులు తెలిపారు. మంజూరైన సీసీ రోడ్లను నిర్దిష్ట వ్యవధిలో పూర్తి చేయాలని ఎంపీడీవో సూచించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ సుమంత్, మురకొండ సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

వయోజనులకు అక్షర జ్ఞానం అందించాలి

పంగులూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : చదువురాని వయోజనులకు అక్షర జ్ఞానం అందించి వారిని ప్రయోజకులుగా తీర్చిదిద్దాలని విద్యాధికారి-2 జి.వీరాంజనేయులు కోరారు. పంగులూరులోని మండల విద్యా వనరుల కేంద్రంలో వయోజన విద్యా కార్యక్రమాల నిర్వహణపై వీవోఏలకు ప్రత్యేక శిక్షణ జరిగింది. మండలంలో 18 నుంచి 60 ఏళ్లలోపు వయస్సు గల నిరక్షరాస్యులను 610 మందిగా గుర్తించామని, వారికి వీవోఏలు, డ్వాక్రా గ్రూప్ లీడర్లు స్వచ్ఛందగా రాత్రివేళ అక్షర జ్ఞానం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం జ్యోతి ప్రసాద్, సీసీలు సాల్మన్, సురేష్, చంద్ర, వీవోలు పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

బల్లికురవ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీలలో చేపట్టాల్సిన అభివృద్ధి ప్రణాళిక తయారు కోసం 15వ తేదీన పంచాయతీ సర్పంచ్‌లకు, సిబ్బందికి బల్లికురవ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శిక్షణ ఇస్తున్నట్లు ఎంపీడీవో కుసుమకుమారి తెలిపారు. ఒక్క రోజు శిక్షణకు ఏర్పాటు చేశామన్నారు. ఆయా పంచాయతీల సర్పంచ్‌లు, సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లు హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

సంతమాగులూరు : గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక, మండల ప్రజా పరిషత్ అభివృద్ధి ప్రణాళికపై ఈనెల 14వ తేదీన శిక్షణ కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో శివరామప్రసాద్ తెలిపారు. ప్రజా ప్రతినిధులు ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు సర్పంచ్‌లు ఒక్కరోజు కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

రేపు అద్దంకిలో..

అద్దంకిటౌన్ : 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామ పంచాయతీలు, మండల పరిషత్ అభివృద్ధి ప్రణాళిక తయారీపై ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల అధికారులతో ఈ నెల 14వ తేదీన ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశపు హాల్‌లో ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు శిక్షణ కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో బత్తిని సింగయ్య మంగళవారం ప్రకటనలో తెలిపారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లుతో పాటు అన్ని శాఖల అధికారులు శిక్షణ కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

అంతర్జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్‌కు నాగరాజు


హెడ్ కానిస్టేబుల్ నాగరాజు

చీరాలటౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : వెస్ట్ బెంగాల్‌లో ఈనెల 15 నుంచి 17 వరకు వరకు జరిగే అంతర్జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్‌కు చీరాల టూటౌన్ హెడ్ కానిస్టేబుల్ సీహెచ్.నాగరాజు ఎంపికయ్యారు. న్యూ కూచ్ బీహార్ స్టేడియంలో 40 ప్లస్ విభాగం షాట్‌ఫుట్, జావెలిన్ త్రో పోటీలలో నాగరాజు తలపడనున్నారు. గతంలో నాగరాజు పలు విభాగాల్లో పాల్గొని పతకాలు సాధించారు. ఈక్రమంలో మళ్లీ విజేతగా తిరిగి రావాలని పలువురు పోలీస్ సిబ్బంది ఆకాంక్షించారు.

17న సర్వసభ్య సమావేశం

అద్దంకి టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈనెల 17వ తేదీన ఉదయం 11 గంటలకు మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడి అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో బత్తిని సింగయ్య మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, శాశ్వత ఆహ్వానితులు, మండల స్థాయి అధికారులు తప్పని సరిగా హాజరుకావాలని తెలిపారు.


దాతల సహకారాన్ని వినియోగించుకోవాలి

సంతమాగులూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : దాతలు అందిస్తున్న సహకారాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని ఎంఈవో కోటేశ్వరరావు తెలిపారు. స్థానిక ఎంపీపీఎస్ స్కూలులో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ఫిజియో థెరపి కార్యక్రమం మంగళవారం జరిగింది. ఫిజియోథెరపిస్ట్ ఇందిరాప్రయదర్శిని సహకారంతో దేవరపల్లి శ్రీదర్‌బాబు, స్నేహితులు రూ.12000 విలువైన పరికరాలను పాఠశాలకు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో దినేస్‌కుమార్, హెచ్‌ఎం కె.అనూరాధ, ఉపాధ్యాయులు బాలి, పిలిఎరెడ్డి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు

ఈపూరుపాలెం(చీరాలటౌన్), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : వాడరేవుకు చెందిన వివాహిత అదృశ్యంపై ఈపూరుపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఆమెకు భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సోమవారం మధ్యాహ్నం నుంచి ఆమె కన్పించం లేదని ఆమె సోదరుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రైలు ఎక్కుతూ జారిపడిన వ్యక్తి మృతి


గిరి (ఫైల్)

చీరాలటౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రైలు ఎక్కుతూ ప్రమాదవశాత్తు జారిపడి వీడియో ఎడిటర్ మృతి చెందారు. ఈఘటన సోమవారం రాత్రి జరిగింది. అందిన వివరాల ప్రకారం.. ఈతముక్కలకు చెందిన ఊట్ల గిరి (34) మండల పరిధిలోని రామకృష్ణాపురానికి చెందిన మహేశ్వరిని ఏడేళ్ల క్రితం వివాహం చేసుకున్నారు. ఇతను మ్యారేజీ వీడియో ఎడిటర్ కావడంతో కొంత కాలంగా భార్య పట్టింటి వద్దే ఉంటున్నారు. అయితే స్వగ్రామం వెళ్లేందుకు చీరాలలో రైలు ఎక్కుతూ జారి పట్టాల మధ్య పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన గిరిని చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈక్రమంలో చికిత్స పొందుతూ మృతి చెందారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని మంగళవారం పోస్ట్‌మార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ప్రైవేటు అంబులెన్స్ ఢీకొని వ్యక్తికి గాయాలు

మద్యం మత్తులోనే ఘటన

చీరాలటౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేటు అంబులెన్స్ డ్రైవర్ మద్యం మత్తులో వేగంగా ట్రాక్టర్‌ను ఢీకొన్నారు. దీంతో ట్రాక్టర్ డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారు. అందిన వివరాల ప్రకారం వేటపాలెం మండలం వడ్డె సంఘానికి చెందిన కత్తి భాను ప్రకాష్ ట్రాక్టర్ డ్రైవర్. ఈక్రమంలో వేటపాలెం వైపు ట్రాక్టర్‌పై వెళుతుండగా అక్కాయిపాలెం వద్ద ప్రైవేటు అంబులెన్స్ డ్రైవర్ కరిముల్లా మద్యం మత్తులో వెనుక నుంచి ట్రాక్టర్‌ను ఢీకొట్టారు. ప్రమాదంలో కిందపడిన భాను శరీరంపై నుంచి ట్రాక్టర్ చక్రాలు వెళ్లాయి. దీంతో కుటుంబ సభ్యులు చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. వేటపాలెం పోలీసులు ఘటనపై కేసు నమోదు చేశారు.